దానబలి.

(వామనచరిత్రము.)

[మహాభాగవతమందలి పద్యములతో రచియింపఁబడిన
ఐదంకముల నాటకము.]



పండిత, సీతారామ కృతము:—

ప్రకటనకర్తలు:—

దుర్గా అండ్ కో

ఏలూరు.

ఏలూరు:—శ్రీ పాండురంగ ముద్రాక్షర శాలయందు,
పి. వి. ముసెయ్య & కె. వి. రామయ్యగార్లచే,
ముద్రింపఁబడియె.

  వెల 1—0—0

ఈ నాటకమునందు వచ్చుపాత్రలు.

పురుషులు.

ఇంద్రుడు—అమరాధిపతి.

జయంతుఁడు—ఇంద్రుని కుమారుఁడు.

బృహస్పతి—అమరులకు గురువు.

మణికంధరుఁడు—ఇంద్రుని భటుఁడు.

బలి—దానవ చక్రవర్తి.

శంబరుఁడు—బలియొక్క మంత్రి.

కాలనాభుఁడు—రాక్షసుఁడు.

శుక్రాచార్యులు—దైత్యులకు గురువు.

కశ్యపుఁడు—ముని.

గాలవుఁడు, జాబాలి — కశ్యపుని శిష్యులు.

రామశాస్త్రి, సోమయాజులు — బ్రాహ్మణులు.

ప్రహ్లాదుఁడు—బలియొక్క పితామహుఁడు.

బ్రహ్మ—సృష్టికర్త.

స్త్రీలు.

అదితి—అమరమాత.

సంధ్యావళి—బలి భార్య.

ప్రియంవద—చెలికత్తె.

రంభ—అమర వేశ్య.

[ఇంకను బ్రాహ్మణులు—సేవకులువత్తురు.]

——

పీఠిక

ఈ కాలమున నాటకములకుఁ గొఱఁత లేదు. అందులకుఁ దగినట్లు ప్రకటనకర్తలకంతకంటెఁ గొఱఁత లేదు. ఒక ఫారమ్ (8 పేజీలు) ఏదో హాస్యరస సంబంధమయిన పుస్తకమును వ్రాయించి "క్రైలు వాఙ్మయముగాఁ బ్రకటించినంత మాత్రముననే "బుక్ సెల్లర్ అండ్ పబ్లిషరు" అను బిరుదమును గ్రంథవిక్రేతయందుచున్నాడు. వ్రాయువారున్నప్పుడు ప్రకటించువారేల యుండరు? నేను నాటక రచనకు నమస్కరించి చిరకాలమయినది. నాటకములన్న మిగుల యరుచి కలిగిన ఈ దినములలో మరల నేను నాటకమును వ్రాయవలసి వచ్చినది. నా మిత్రులును, శ్రేయోభిలాషులును, నిర్వచన నిరోష్ఠ్య సుందరీసుందర చరిత్ర్యాది గ్రంథకర్తలును నగు మహారాజశ్రీ డాక్టరు బుద్ధిరాజు శేషగిరిరావుపంతులుగారు, నాయందుండు ప్రేమచేత గాబోలు, భాగవతమందలి వామన చరిత్రమును సందర్భము ననుసరించి యందలి పద్యములనే యేరించి ప్రదర్శనార్హముగ నుండునట్లు నాటకముగ వ్రాయఁ బ్రోత్సహించుటయే యిందులకుఁ గారణము. బాల్యమున నాటకవిద్యాభివృద్ధి కాటంకము గలిగించి, కొంచెముగ నన్నుఁ జేరిన నాటకానుభవము మననమునందుంచుకొని, ఈ నాటకము రచించితిని. ప్రదర్శనార్హమగునని తోచునేని నటకులు దీనిం బ్రదర్శించి నాకు మోదము గూర్తురు గాక యని కోరుచున్నాను. ఇందలి మంచిచెడ్డలు గ్రహించుటకు రసగ్రహణ పారీణులుండిరి కదా!

ఏలూరు,
27—8—29.

ఇట్లు సుధీజనవిధేయుండు,
డా॥ సీ తా రా మా రా వు.

దానబలి.

—:నాంది:—

మ. నతసర్వామరమూర్ధభాగ్మకుట సం ♦ తానంబునన్ వేనికాం
తితతుల్ పంకజరాజ కందళములై ♦ దీపించుచుం డవ్విసం
స్తుత నానామునిమాన సచ్ఛల గృహ ♦ స్తోమంబులందివ్వెలై
నతతంబింపగునట్టి వామను పదా ♦ బ్జంబుల్ మిముంబ్రోచుతన్.

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—(ప్రవేశించి సభ్యులఁ జూచి తనలో) ఓహో! సభ్యులు నాటక ప్రదర్శనమునకై నిరీక్షించుచున్నారు. ఇఁక నేను తొందర పడవలయును. (ప్రక్కకుఁ దిరిగి చూచి) పారిపార్శ్వకా! నీవొకసారి యిటు రమ్ము.

పారిపార్శ్వకుఁడు—(ప్రవేశించి) ఆర్యా! ఏమి సెలవు?

సూత్ర—ఏమి సెలవని యడుగుచుంటివా! అటు చూడుము! వర్షాగమనమునకు వేచియుండు చాతకంబుల తెఱంగున నీ సభ్యులు మన నాటక ప్రదర్శనమునకై వేచియున్నారు.

పారి—అయినచోఁ గాలహరణమేల ? ఏదో యొక నాటకము ప్రదర్శింతము. ఈ కాలమున నాటకములకుఁ గొఱఁత లేదుకదా !

సూత్ర—మంచి పెద్దలు చూడవలదా !

పారి—వానిని విమర్శించువారు తక్కువమంది యుందురు. ఇంతకును మీరేనాటక ప్రదర్శనమున సభ్యుల చిత్తములు రంజిల్లఁ జేయుదురు.

సూత్ర—"దాన బలి" యను నామాంతరముగల వామన చరిత్రము.

పారి—ఓహో ! ఇందేకదా ! శ్రీమన్నారాయణుఁడు అదితికశ్యపులకు వామనుఁడై జన్మించి, వదాన్యుఁడగు బలింజేరి, మూడడుగులభూమి దానము గ్రహించి, యాతని రాజ్యశ్రీలను మహేంద్రునకుఁ గూర్చెను ? (ఇంచుక యూరకుండి) కథ మంచిదే ! బలి వదాన్యతయు- సత్యసంధతయు మెచ్చవచ్చును ! నాటకము రచించిన దెవరు ?

సూత్ర—

చ. తిరుపతి వేంకటేశ్వర సు ♦ ధీంద్రులఁగొల్చి సరసతాద్భుతా
కర రసపుంజమంజుల వి ♦ కస్వరచారు కథాసుధాధురం
ధర బహుళ ప్రబంధ కవి ♦ తావనితా మహితోక్తి సంపదన్
ధరణిని ఖ్యాతిఁజెందు కవి ♦ తల్లజు నాతని నీవెఱుంగవే.

పారి—శతాధిక గ్రంథకర్తయగు సీతారామాభిధానుఁడా దీనికిఁ గర్త

సూత్ర—అవును. ఆంధ్రమహాభాగవతమందలి పద్యములనుసందర్భమునను సరించి పొందుపఱచి ఆతఁడీ నాటకమును రచించి:— "పరోపకారార్థ మిదం శరీరమ్" అను స్మృతివాక్యార్థము బాగుగ గ్రహించిన విజ్ఞానియు, తన మానసంబును లక్ష్మీ

కళత్ర మరాళకేళికి మానసంబుగఁ జేసిన భక్తాగ్రేసరుఁడును; తన చేతి యీవి యాచకజనపిక ప్రకరంబునకుఁ జిగిర్చిన మావిగ నొనర్చిన దాన దయాపరుఁడును; కృష్ణామండలమున దివిసీమయందున్న నాగాయతిప్పగ్రామ నివాసియు, సుప్రసిద్ధ కమ్మకులీనుఁడును అగు రావుసాహేబు కంఠంనేని వేంకట రంగనాముని కావ్యకన్యకకుఁ బతిగా నొనర్చినాడు.

పారి—సరే! ఈ నాటక రచనవలన గ్రంథకర్త లోకమునఁ గృతార్థుఁడే యగునో, పరిహాసపాత్రుఁడే యగునో మనము చూడవలయును.

సూత్ర—రసగ్రహణపారీణులు దానిని నిర్ణయింపవలయును. అయినను మనకీ సంశయమేల?

మ. కతయా శ్రీహరిలీలఁ దెల్పుకతయే • కర్తా యగణ్యుండు, మే
ల్చతురుల్ నర్తకులున్ సభాజనములా • శాస్త్రజ్ఞులున్ బండితుల్
గృతి కన్యాధవుఁడా తలంపఁగను స • త్కీర్తి ప్రతాపాఢ్యుఁడీ
గతిఁ జేకూరె సమస్త మొక్కెడ నిం • కన్ సంశయం బేటికిన్.

రమ్ము. ప్రదర్శనమున కుపక్రమింతము.

(నిష్క్రమింతురు.)

శుక్రా—ఇక నీవు తత్కార్యంబునకుఁ గడంగవచ్చును. కొంఱత యేమున్నది?

బలి—నీ మహాదాశీర్వచన మొక్కటి యేకొఱంత.

శుక్రా—నీవు తప్పక విజయలక్ష్మీలాలితుఁడ వగుదువు. సంశయము లేదు.

బలి—(ఎదుటఁ జూచి) శంబరా!

శంబరుఁడు—దేవా! వచ్చుచున్నాను. (ప్రవేశించును)

బలి—(శంబరునిఁ జూచి) శంబరా! మన మమరావతిపై రేపే దాడి వెడలవలయును. బలంబుల నన్నియు సిద్ధముఁ జేయుము. మన సైన్యములలో నెవ్వఁడును దాపసులకుఁగాని, బ్రాహ్మణులకుఁ గాని, భక్తజనంబులకుగాని, యేమాత్రము బాధ కలిగింప రాదు. పొమ్ము. నీ ప్రయత్నమున నుండుము.

శంబ—ఆజ్ఞ ననుసరించెదఁగాక! (నిష్క్రమించును.)

శుక్రా—నాకును వేళయైనది.

బలి—నేనును వచ్చుచుంటిని.

(నిష్క్రమింతురు.)

రంగము:—(ఇంద్రలోకము:—సభాభవనంబున ఇంద్రుఁడు సింహాసనాసీనుఁడై ప్రవేశించును.)

ఇంద్రు—(స్వగతము) ఓరా! ఈ బలిదానవుని సాహసమేమని తలంతును! మున్ను నాచే సంపూర్తిగ నోడింపఁబడి యసురులతోఁ గూడ నెక్కడికో పోయిన యీ రక్కసుఁడు మరల

నాపై నేఁడు దండెత్తివచ్చెనే! "వినాశకాలమునకు విపరీతపుబుద్ధులు పుట్టు" నన్నట్లు, వీనికిఁ జేటుకాలము సమీపించుటచేతనే మరల నాపై కెత్తివచ్చినాఁడు. ఇఁక నీసారి వీనినిబాటిపోయినను వెన్నంటి సంపూర్తిగఁ బరాభవించి, జగంబదానవముగఁ జేసెదఁ గాక!

జయంతుఁడు—(ప్రవేశించి ఇంద్రునిఁ జూచి) తండ్రీ! మన సైన్యంబులను నాయా దెసలందుఁ గడు జాగరూకతతో నుండ నియమించి వచ్చితిని. ఆ బలి, మన కోటచుట్టును బలంబుల విడియఁజేసి మార్గంబుల నరికట్టినాఁడు. ఇంక నీవాలోచించెద వేల? రణంబునకు నాకనుజ్ఞ నిమ్ము. నేనా దానవనాథుని బలంబులఁ జొచ్చి,

చ. గురుశరపంక్తి నశ్వములఁ • గూల్చి, సిడంబులఁ జెండి, కార్ముకోత్కరములఁ దుంచి సారథుల • ధైర్యమడంచి రణప్రవీణులన్
విరథులఁ జేసి యంతకుని • వీటికిఁ బంపి సురారినాథునిన్
బోరిఁ గొనివానిఁ గూల్తుఁ బరి • పూర్ణబలంబునఁ జేర్చి యార్చుచున్.

ఇంద్రు—(ఎదుటఁ జూచి) అదిగో! ఆచార్యుఁడు వచ్చుచున్నాఁడు.

బృహస్పతి—(ప్రవేశించును)

ఇంద్రు—గురువర్యా! అటుఁ గూర్చుండుము.

బృహ—(ఆసీనుఁడై) ఏదియో! ఆలోచించుచున్నారే!

ఇంద్రు—(బృహస్పతినిఁ జూచి) ఆచార్యా! బలిదానవుఁడు దర్పించి మహాబలంబులతో మరల మనపై కెత్తివచ్చి యమరావతిని నాల్గుదిక్కుల ముట్టడించెనే! శ్రీమన్నారాయణుఁడు మనయెడల గరుణించి, మాయా మోహినీరూపంబున దైత్యుల వంచించి, యమృతంబు మన కొసంగినప్పుడే బలికిని మనకును

టకు శ్రీహరి తప్ప మఱియొకరు శక్తులుగారు. కావునఁ బ్రస్తుతము మీరు త్రివిష్టపంబు విడిచిపోవుటయే మంచిది. శుభదినములు వచ్చినప్పుడు మరల రావచ్చును.

ఇంద్రు—మా శ్రేయోభిలాషివగు నీ యనుజ్ఞ ననుసరించెదము. (ఇంచుక యూరకుండి) ఆచార్యా! అమరావతీనగరమునువిడిచి పోవలసినదేనా! చింతామణీ పారిజాతోచ్చైశ్శ్రవైరావతాది మహాభాగ్య సమన్వితుఁడనగు నేను రాజధానిని విడిచి యందండుఁ జరింపవలయునా! నందనవనారామసీమలయందు విహరించు నేను విపినంబులయందు మూలమూలల డాగవలయునా! మందాకినీతీరస్థపాండుసైకత ప్రదేశములఁ జరించు నేను కొండలందు వసింపవలయునా! శుద్ధాంత సౌధంబులయందుఁ బరిచారికా సహస్రంబులు సురటీలువీవ సౌఖ్యంబున విరాజిల్లు నా యర్ధాంగియగు శచియు, సుకుమార శరీరుఁడగు నీజయంత కుమారుఁడును దుర్భర కష్టముల పాలగుదురు కదా!

బృహ—పాకశాసనా! నీవిందులకు విచారింపవలదు. భగవంతుని మాయఁ గనుఁగొనుట కెవ్వరును శక్తులుగారు. ఈ కష్టమెప్పుడును గాపురము చేయునది కాదు. నీవు త్వరలోనే మరల నీ వైభవమును బొందఁగలవు.

(తెరలో కలకలము.)

ఇంద్రు—ఏవియో భయంకరార్భాటములు వినవచ్చుచున్నవి.

(మణికంధరుఁడు ప్రవేశించును.)

మణి—(తొందరగాఁ బ్రవేశించి యింద్రునిఁ జూచి) దేవా! జయము జయము.

ఇంద్రు—మణికంధరా! పరుగెత్తుకొని వచ్చితివేల?

మణి—మహేంద్రా! ఏమిచెప్పుదును? దైత్యులు ముట్టడించుటచే మన నగరమంతయు దైత్యులతో నిండిపోయినది. దైత్యేంద్రుఁడయిన బలి, యిప్పుడు నీకడకు వచ్చుటకుఁ బయనమగుచున్నట్లు తెలియుచున్నది. మనమింక నేమి సేయవలయును? దనుజులను యుద్ధమునఁ దాకుదమా! లేక మఱియేదైన నొక మార్గమాలోచించి యుంటిరా? దేనికైనను మనము త్వర పడవలయును కదా!

ఇంద్రు—బలిని దాకుటకిప్పుడు మనకు మంచికాలముకాదు. అమరులు నగరమునువిడిచి పోవలసినదే. అందఱు నట్లు సేయ నాయాజ్ఞ గాఁదెలుపుము. పొమ్ము.

బృహ—(ఇంద్రునిఁజూచి)

సీ. యుద్ధంబునకురమ్ము • సిద్ధుండవైయని,
యసురేశ్వరుండిప్పు • డడుగకుండ
యిత్తువారాజ్యంబు • నీయవాయని దైత్యుఁ
డెదురుగానే తెంచి • బదరకుండ
బలవంతముగలాగి • భద్రపీఠముపైన
సురశాత్రవుండు కూ • ర్చుండకుండ
భావంబు నొప్పింపఁ • బరిహాసవాక్యంబు
లసురనాయకుఁడు ని • న్నాడకుండ
తే. సర్వమిాశుమాయఁగనెంచి • స్వాంతమందుఁ
జింతవిడనాడి నీవింక • శీఘ్రగతిని
యాలుబిడ్డల దోడ్కొని • యమరపురిని
విడిచి చనుము శుభంబులఁ • బడయఁ గలవు.

(తెరలో)

ఇంద్రుఁడొక్కఁడ ! దైత్యేంద్రుఁడగు బలి యాతని జూడఁ గోరుచున్నాఁడు.

బృహ.— (ఎదుటఁజూచి) ఇంద్రా ! అదిగో వైరోచని యిటు వచ్చుచున్నాఁడు. కానిమ్ము. నీవువీనియెడల నతివినయమును బ్రకటించుచు సంభాషింపుము. తీవ్రత మాత్రము ముఖంబునఁ జేర్పకుము. అదిగో చూడుము.

శా. శుంభల్లీల మహోగ్రశౌర్యధనుఁడై • సొంపొందు కల్పాంత కృ
చ్ఛుంభుండోయన దుస్సహప్రకట దో • స్సారంబు దీపింపఁగా
సంభోరాసి వితానఁ బొంగి సమర • వ్యాపార లీలాకళా
సంరంభుండై యిటువచ్చు దానవుని జే • రంజాల విప్పట్టునన్.

(బలియును-శంబరుఁడను రాక్షసుఁడును ప్రవేశించుచున్నారు.)

శంబరుఁడు—దానవేంద్రా ! మనరాకఁగాంచి నిర్జరులందఱును రాజభాని విడిచి యరిగినట్లు తోఁచుచున్నది. ఇఁక మనకు సమరముతో నవసరము లేదు. (ఎదుటజూచి) అదిగో! మహేంద్రుఁడు

బలి— (ఇంద్రుని సమీపించును)

ఇంద్రు— (పీఠముదిగి బలింజూచి) దానవలోక చక్రవర్తీ ! ఈభద్రపీఠము నలంకరింపుము.

బలి—ఎప్పుడును లేని వినయమును నీవునేఁడు మాయందుఁ జూపుచుంటివే ! దేవతాసామ్రాజ్య పీఠ మధిష్ఠించుటకే యీ బలి యరుదెంచెనని నీవుగ్రహించ గలిగితివే ! (ఇంద్రుని సింహాసనమునఁగూర్చుండి) మహేంద్రా ! చిరకాలమునకు నిన్నుఁ జూడఁగలిగితిని.

శంబ — పాకశాసనా ! నీవింకను నిచ్చట నుంటివేమి ?

బలి — అమరేంద్రా ! సురసామ్రాజ్యము నాస్వాధీనము జేసికొనుట కేవచ్చితిని.

మ. అరచేతంగల నిమ్మపండుగతినీ ♦ వాడించితిన్నాళ్ళు, శ్రీ
కరముల్ సర్వసుఖప్రదాకరములౌ ♦ కాతీతసౌందర్య గో
పురవిూనాకము ; నింకఁజెల్లదు, బల ♦ స్ఫూర్తిన్ విజృంభించు భీ
కర దేవాంతక వహ్నినడ్డుటకు నీ ♦ కా కాదు కా నేరికిన్.

గౌరవంబుగ సామ్రాజ్యము నర్పించి, నీ వమరావతిని విడిచెదవా ! లేక భీకరసమరతలంబున నన్నెదిరించి నిలిచెదవా !

బృహ — దానవేశ్వరా ! మామహేంద్రుఁడిప్పుడు నీతో రణంబొనర్ప దలంపలేదు. ఈ సురసామ్రాజ్యమును ధర్మపథానువర్తనుఁడవగు నీకు సమర్పించి తాను తొలంగవలయుననియే తలంచి యున్నాఁడు. యుద్ధమునకుఁ దగుప్రయత్నములేమైన నున్నట్లు నీకు గోచరించెనా ! మా యసురులను పురప్రవేశ మొనర్చుట కమరులెవ్వరైన నాటంకపఱచిరా !

బలి — ఆచార్యా ! "అందినఁజుట్టు; లేకున్న కాళ్ళు" ననుసామెత మీ మహేంద్రుని యందు సార్థకమగుచున్నది. అమృతోత్పాదన ప్రయత్న సమయమున శ్రీహరి నాశ్రయించి, కపట మోహినీ రూపము ధరింపఁజేసి సకలామర సహితుండై యమృత మంతయుఁ ద్రావి, యనంతరము ప్రచండఖండనంబున మమ్ముఁదాకి జయంబుగొన్న యీ పాకశాసనుని పరాక్రమ మిప్పుడేమూలనడంగి యున్నది ? మందాకినీ దివ్యస్రవంతిలోఁ గలిసిపోయినదా ! అసురులను బాఱదోలితినని యానందించెనే !

ఇంద్రు—దానవాగ్రణీ! ఎప్పటి మాటలో యిప్పుడు తలంపనేల?
కాలచక్ర మెప్పటికెట్లు తిరుగునో యెవ్వరును జెప్పఁజాలరుకదా!

బలి—అజ్ఞానము నీకప్పుడున్నదా! బలిని గెలిచితినని మిట్టిపడితివే.

ఆ. జయములపజయములు • సంపదలాపద
లనిలచలితదీపికాం • చలములు
చంద్రకళలు మేఘ • చయములు దరఁగలు
మెఱుఁగులమరవర్య • మిట్టిపడకు.

ఇఁక నీయధికారము సురలోకముపై సాగదు. ధర్మసంస్థాపనార్థమే నేనీ బృందారక రాజ్యలక్ష్మిని వశపఱచుకొనుచుంటిని. ఇదియే నా నిజమైన యభిప్రాయము. సామ్రాజ్యపాలకుని గుణములు ప్రజల కాదర్శకములై యుండవలయును. "కంచెయే చేనుమేసిన నింకఁ జేయఁ గలిగిన దేమున్నది? పాపరతుఁడవును, అధర్మవర్తనుఁడవును నగు నీ వీ సామ్రాజ్యము పరిపాలింప ననర్హుండవు. నీయనుచరు లెప్పుడును నీయందుండు దుర్గుణములనుగాని, దుర్వర్తనముగాని బయలుపఱచరు నీకు వారియెడలఁ బ్రేమకలుగుటకు నీవొనర్చెడి దానికెల్ల సంతసించుచుఁ దలయూఁచుచుందురు. చిత్రాభరణ పటస్థితిఁ బ్రకాశించుటయుఁ, జామరానిలావృతిఁ గనుటయు, మహోన్నతకాయంబున విఱ్ఱవీఁగుటయు, వాద్యధ్వనితో వెడలుటయు, దనవారి మాటవినుటయుఁ బరులదూరంబుగాఁ దరుముటయు మొదలగు గుణములు రాజునకే గాక గంగిరెద్దునకుఁగూడఁ గలవు. రాజని నంతమాత్రముననే రాజు కాఁడు. ధర్మదయాదాన గుణంబులు శరీరంబునకు భూషణంబులుగా ధరించినవాఁడే నిక్కమైన రాజన్యుఁడు. అట్టివానినే ప్రజలు గౌరవింతురు.

ఇంద్రు—నిర్జరారీ! కాలము తప్పివచ్చినది కదాయని నీవునన్నట్లు
పలుకుచుంటివిగాని, లేకున్న నాయధర్మవర్తన మేమియున్నది

బలి—నీకుఁ జెప్పవలయునా !

ఉ. మారుని బారికోడి యభి • మానము వీడుచు గ్రామకుక్కుటా
కారముఁ దాల్చి, గౌతముని • కాంతయు సాధ్వియు నాయహల్యకున్
జారుఁడవై మహాకఠిన • శాపముఁ గాంచి సహస్రయోని సం
భారము మేనఁ గాంచితివి • పాపము నీగతి జ్ఞప్తి తప్పెనే.

ఇంతకంటె ఘోరమగు పాపమేమి కావలయును. మునివధూమణుల వంచించుటకేనా సురసామ్రాజ్యమునకు నీవధిపతివైతివి! మీ బృందారకులు రక్కసులను దుష్టచరిత్రులని నిందింతురుగాని, యిట్టి దుష్కృత్యములకు ముందుఁ ద్రోవఁ జూపిన వారు మీరే !

బృహ—(తనలో) ఈతఁడమరేంద్రుని చిత్తమును పోటు మాటలచే నొప్పించుచున్నాఁడు. నేనేమైన నిందు జోక్యము కలిగించుకొంటినేని, నాసంగతి నెత్తునేమో ! ఇఁక నాలస్యము సేయకుండ నెమ్మదిగా నావలఁ బడుటయే మంచిది.

శంబ— (బలినిజూచి) దైత్యేంద్రా ! దేవేంద్రునకట్టి సుగుణము నేర్పినదీ యమరగురుఁడైన బృహస్పతి. యేసుగుణసంపత్తియుం దీతనిని జెప్పి మఱియొకనిఁ జెప్పవలయును. ఈమహానుభావుని గూర్చి నీవెఱుఁగవాయేమి! అగ్రజుని భార్యతోఁ దగులుసల్పిన యాచార్యుఁడు. ఇట్టివాఁడు కావుననే నీకు జ్ఞాపకములేదా ! ఈయనభార్య తార చంద్రునితోఁ గొన్నాళ్ళు కాపురముఁ జేసి బుధునిఁ గాంచినది. విబుధలోకమంతయు వర్ణసంకరమే !

బృహ—(తనలో) ఈదుర్మార్గుఁడు నేననుకొన్నట్లే చేసినాఁడు (ఇంద్రునితో రహస్యముగా) మహేంద్రా ! ఇంకను మనమిచ్చట నుండనేల ? నెమ్మదిగా నావలకుఁ బోవుదము.

శంబ—(బృహస్పతిని జూచి) అమరాచార్యా! ఇంద్రుని చెవులుకొఱుకుచున్నావేమి!

బలి—(ఇంద్రునిఁజూచి) ఇంద్రా! కాలచక్రమెప్పటికెట్లు తిరుగునో యెవ్వరును జెప్పఁజాలరని నీవే వచించితివి కదా! కాలమహిమచే నేనిప్పుడు నీసామ్రాజ్యంబు నాక్రమించితిని. ఇఁక నీవు సత్వరముగ నీ నెలవునుండి వెడలుము. పొమ్ము.

ఇంద్రు—(బృహస్పతి-జయంతులతో నిష్క్రమించును.)

బలి—శంబరా! అమరలోకము మనకు నాయాసములేకుండ స్వాధీనమైనది (ఇంచుకయూరకుండి) నేనిచ్చోటకు వచ్చునప్పుడు మన గురుండైన శుక్రాచార్యుని సత్వరముగరమ్మని వేడితిని. అమ్మహానుభావుఁ డింతవఱకును రాకయుండుట కేమి కారణమో?

శంబ—(ఎదుటఁ జూచి) అదిగో ఆచార్యుఁడు వచ్చుచున్నాఁడు.

(శుక్రాచార్యులు ప్రవేశించును)

బలి—(పీఠమునుండి లేచి) ఆచార్యోత్తమా! నావందనములందుకొనుము. (శుక్రుని పాదములకు నమస్కరించును)

శుక్రా—అమరలోక సామ్రాజ్యపీఠ మధిష్ఠించిన దానవచక్రవర్తికి జయంబగును గాక! (ఆసీనుఁడగును)

బలి—మహాత్మా! భార్గవా! నీయమూల్య కరుణావిశేషమునఁగదా నేనీమహోన్నత దివ్యపదవి నందఁగలిగితిని. నీ ఋణము నేను సహస్ర జన్మములకైనను దీర్పఁజాలను.

శుక్రా—వైరోచనా! సద్యశోలతలు దిగంతములఁ బ్రాకించుచు, సామ్రాజ్యాభివృద్ధిఁగోరుచు, నభియాతివ్యూహావిజ్ఞాత సర్వాశోత్కృష్ట విజయుఁడవై, సామంతమండలి భవదాజ్ఞావశవర్తులాగ నీ వీ రాజ్యేందిర నేలుకొనుము. దురాత్ములై కుట్రిలు

బన్ను రాజద్రోహిమండలమునకు గుండెదిగులై, ఆశ్రయించిన దీనకోటికి దంగేటిజున్నై, అధర్మమార్గము పరిత్యజించి మెలఁగ గోరు సుగుణశీలుర కఱచేతి వెన్నయై, రాజ్యమునకుఁ జేటుఁ గూర్పఁదలఁచు దురాత్ములపాలి ధూమకేతువై నీపరిపాలనము వర్ధిల్లుఁగాక ! ఆయురారోగ్య సకలైశ్వర్యములును, జయసమోన్నతులును, స్వజనానంద ప్రశస్తశీలమును, సామ్రాజ్య రక్షణోద్యోగశక్తియు, సత్యవాక్ప్రతిష్ఠాపనామతియు, దండశాసన గుణార్జవమును, వైరినిర్దళనవ్యాపారరతియు, నీయందు నిలచుఁగాక ! భవత్పరిపాలనా వైభవము సత్కవిపుంగవుల నిర్మలవాణిచేఁగీర్తింపఁబడుఁగాక!

(తెరలో కలకలము)

శంబ—(చూచి) కాలనాభుఁడు రంభనుగాళ్లు తోడ్కొని వచ్చుచున్నాఁడు.

(కాలనాభుఁడు-రంభతోఁబ్రవేశించును)

కాల—(రంభనుజూచి) ఓసీ ! దానవచక్రవర్తి సన్నిధికి నడువుము. నీకులుకులు, నీతిప్పులు, నడకలు,దొంగచూపులు, రాక్షసుల యొద్దఁబనికిరావు పద (సమీపించుచున్నాఁడు)

రంభ—నేను వచ్చుచుంటిని, నన్ను ముట్టకుము.

కాల—నీశరీరమునకు నాహస్తము తగిలినయెడల నీపాతివ్రత్యమునకు భంగము కలుగునాయేమి ! పాపము!

రంభ—(తనలో) కమలాల యాకృత్యము లతివిచిత్రములు. ఆమెకటాక్షమున్నచో నిర్ధనుఁడు సప్తద్వీపవముద్రముద్రితమహీచక్రంబుఁ బరిపాలించు చక్రవర్తి యగును. ఆమె కటాక్షము తప్పినచోఁ జక్రవర్తి నిరుపేదయగును.

కాల—(బలిం జూచి) దానవేంద్రా! దేవవేశ్యయగు నీరంభ, మన మరుదెంచి దేవతాలోకము నాక్రమించితిమని యొక్కడికో కాలికి బుద్ధిఁ జెప్పచుండఁగాఁ బట్టుకొని నీసన్నిధికిఁ దోడ్కొని వచ్చితిని.

శంబ—భూలోకమున సమస్త శాస్త్రప్రవీణులగు బ్రాహ్మణులు యజ్ఞములు సేయుట యీరంభ నిమిత్తమే యని వినియుంటిని.

బలి—(శుక్రాచార్యునిఁ జూచి) ఆచార్యా! మోక్షమునాశించిగాని, భాగ్యముకొఱకుఁగాని, లేక మఱియే యభీష్టమునకైనఁగాని భగవత్ప్రీతిగ యజ్ఞములు సేయుదురుగాని, ఈరంభనిమిత్తమా యజ్ఞములు చేయుట! తుచ్ఛమగు నిట్టిభోగమునకా! (రంభను జూచి) ఓవారనారీమణీ! నీవు మమ్ములఁగూర్చి యావంతయు భయంబందవలదు. ఈ బలిచక్రవర్తి మీ మహేంద్రునివలె దుష్ప్రవర్తనుఁడని సంశయింపవలదు. నేనీ దేవలోకము నాక్రమించితినని యుబలవగు నీవెచ్చటకును బోవనవసరములేదు. దేవతా మహోత్సవముల యందును, నే నొనర్చు క్రతువుల యందును, నాసభాస్థానంబునందును నీనృత్యగానాభినయంబుల బ్రకటించుచుండుము. పొమ్ము.

రంభ—దానవలోక సార్వభౌముని యాజ్ఞశిరంబున ధరించుచున్నాను. (నిష్క్రమించును)

బలి—(శంబరునిఁ జూచి) శంబరా! నేఁడు మొదలు మనరక్కసు లెవ్వరును నధర్మకార్యముల నేయరాదు. సుజనుల హింసించుట పరాంగనలఁ బట్టుట, మునులను వేధించుట, మొదలగు దుష్టకార్యము లెవ్వరును నేయరాదని నాశాసనముగాఁ దెలుపుము.

శాసనోల్లంఘన మాచరించువారు కఠినముగా శిక్షింపఁబడుదురు. ఇంతకుముందు మనదైత్యులధర్మపరులై యుండుటచేతనే నాశమందిరి. (శుక్రాచార్యునిజూచి) ఆచార్యా! ఇఁక మనుమరుగుదమా!

శుక్రా—నాకును వేళయైనది. రమ్ము.

(అందఱును నిష్క్రమించుచున్నారు)



—: ద్వితీయాంకము :—

రంగము—కశ్యపాశ్రమము—కశ్యపుని శిష్యుఁడైన

గాలవుఁడు—ప్రవేశము.

గాలవుఁడు.—(తనలో) గురుండగు కశ్యపుఁడు మహాకరుణా సాగరుఁడు కదా! నాయెడల వాత్సల్యముఁ బూని ఋగ్యజుస్సామ వేద వ్రజమును, దద్రహస్యములును, శాణాదభాష్యమీమాంసలును, మహాషడంగములును, నెఱింగించెను. విజ్ఞాన మర్మంబు వినిపించెను. మంత్రశాస్త్ర సమితి నొడివెను. సకల పురాణంబులను నాకళిం పొనరించెను. లక్షణ విధమును బోధించెను. వైద్యాగమము సమగ్రముగఁ దేలపఱచెను. ఆహా ? ఇట్టి గురువులయొద్ద విద్యాభ్యాసముఁ గావించు శిష్యుల కేమియుఁ గొఱత యుండదుకదా ?

(జాబాలి—ప్రవేశించును)

జాబా—(గాలవునిఁజూచి) ఏమిరా ! గాలవా ! ఏమిచేయుచున్నావు? ఎప్పుడు చూచినను నేదియో యాలోచనయే సేయుచుందువు. కొంచెము నీపైనను మనస్సునకు విశ్రాంతి యొసంగవుకదా ! చేతిలో పుస్తకమును వదలవు.

గాల—మిత్రుఁడా! స్వగ్రామము విడిచి మనమింత దూరమువచ్చిన దెందులకు? ఈ మహానుభావుఁడగు కశ్యపు నాశ్రయించి విద్యలఁ గఱచుట కేకదా!

జాబా—నీకేమి! నీవు సకల విద్యా పరిపూర్ణుఁడవై తివి. నాపనియే వలయాకారముగ నున్నది. పశాస్త్రము పూర్తికాలేదు.

గాల—నీకు విద్యయందు విశేష శ్రద్ధలేదు.

జాబా—అదిగో! ఆ మాటయే పలుకవలదని చెప్పినాను. అందులకు నేను సమ్మతింపను. శ్రద్ధకేమియు లోపములేదు. బుద్ధికేలోపము. అందఱికంటె నాయొద్దనొకగొప్ప తెలివియున్నది. పాఠము గ్రంథము చూడఁగనే వచ్చును. తరువాత గురువుగారు చెప్ప మన్నప్పుడు—కడుపులో ప్రవేశించిన విషయములు మరల నీవలకు రావు.

గాల—ఈమాటల కేమిగాని నీవు గ్రంథముఁబట్టి తదేకదృష్టితోఁ బఠించినచో నీవు కృతార్థుఁడవు కాఁగలవు.

జాబా—పుస్తకముపైఁ దదేక దృష్టి యుంచియే యుందును. కానీ మనస్సు మాత్రము దానిపైనుండదు. లోకసంచారము చేయు చుండును.

గాల—నీవు నామాటవిని కొన్నాళ్ళు "సారస్వత రసాయనము" పుచ్చుకొనుము, మేధాసిద్ధి వచ్చెదవు.

జాబా—వద్దు, వద్దు—కొండనాలుకకు మందు పుచ్చుకొనిన పెద్ద నాలుక యూడినట్లవుతుంది. నీవు చెప్పినది పుచ్చుకొన్నచో బుద్ధి వృద్ధికాదు కాని కడుపులో పసరుమాత్రము పూర్తిగా పెఱుగును. దానికి తెల్లతేగడ ప్రయోగించవలెను. ఈయవస్థ లెందుకు? లోకములో అందఱును పండితులేయున్నారా?

గాల—గురువుగారు వచ్చుచున్నారు. మాటలాడకుము.

జాబా—గ్రంథ పఠనము చేయుచున్నట్లుండ వలెను.

(కశ్యపుఁడు—ప్రవేశించును)

గాల }
జాబా } గురువర్యా! వందనములు.

కశ్య—(గాలవునిఁజూచి) గాలవా! ఈ జాబాలియేమి చదువుచున్నాడు.

జాబా—ఏమియు లోపములేదు. అన్నియుఁ జదువుచున్నాను.

కశ్య—ఏవి! నిన్న నేను చెప్పిన "నిత్యాయ త్రిగుణాత్మనే" అను శ్లోకమును "నిత్యస్వోదర పూరణాయ" అను శ్లోకమును చదివి వానియర్థముఁ జెప్పుము.

జాబా—అయ్యా! గ్రంథము చూచి చదువనా!

కశ్య—చూడకుండఁ జదువలేవా!

జాబా—చదువఁ గలుగుదునుగాని నేను చదువు నాలుగు పాదములును శాస్త్రప్రకార మొకపాదమే యగునని కొంచెము సంశయము.

కశ్య—అట్లయిన—గాలవా! నీవు వానిని జదువుము. వీఁడర్థముఁ జెప్పును.

జాబా—అర్థమున కిబ్బంది లేదు.

గాల—

శ్లో. నిత్యాయత్రి గుణాత్మనే పురజితే కాత్యాయ నీశ్రేయసే
సత్యాయాది కుటుంబినే మునిమనః ప్రత్యక్ష చిన్మూర్తయే
మాయాసృష్ట జగత్త్రియాయ సకలామ్నా యాంతసంచారిణే
సాయంతాండవ సంభ్రమాయ జటినే సేయంనతిశ్శంభవే.

శ్లో. నిత్యంస్వోదర పూరణాయ సకలానుద్దిశ్య విత్తాశయా
వ్యర్థంపర్యటనంకరోమి భవతస్సేవాం నజానేవిభో
మజ్జన్మాంతర పుణ్యపాపబలత స్త్వం శర్వ సర్వాంతర
స్తిష్ఠస్యేన హి తేనవా పశుపతే తేరక్షణీ యోస్మ్యహమ్.

కశ్య—జాబాలీ! మొదటి శ్లోకమునకు నీవర్థముఁ జెప్పుము.

జాబా—స్వామీ! ప్రతిపదార్థమా? లేక తాత్పర్యముఁ జెప్పు మందురా!

కశ్య—అనవసర సంభాషణముతో నీవు వృథా కాలయాపనము సేయకుము.

జాబా—మహాత్మా! బాల్యమున మాతల్లి నాకు వస విశేషముగా నూరిపోయుటచే నిట్టి వాగ్ధాటి కలిగినది. కాని, ఇది విద్యకుఁ బనికి వచ్చుటలేదు.

గాల—జాబాలీ! శ్లోకార్థము చెప్పుమని గురువుగా రడిగిరి. ఈమాట లన్నియు నెందులకు? త్వరగా కానిమ్ము.

జాబా—ఇదిగో! ఎంతసేపు. (కశ్యపునిఁ జూచి) దేవా! సావధాన చిత్తులై వినుఁడు. ఆశ్లోకమునకు అర్థమేమనఁగా! నిత్యమును, మూఁడు గుణములు. అనఁగా కామ, క్రోధ మోహములు గలిగి పురజితే అనగా పురములను జయించుచు-గూఢార్థము-దారులను గొట్టుచూ - శ్రేయము కొఱకు - గంగానమ్మను ఇక్కడ - కాత్యాయని - అనగా ఆ దేవత కర్థము. సిత్యా యాది కుటుంబినే - అని యున్నది- అంటే - పెద్దయింటివాళ్ళు అందులో జన్మించిన దెవరు? వాల్మీకి - ఆవాల్మీకికి యీ శ్లోక ములో "ముని" అని ప్రయోగించినాడు. పైఁజెప్పిన దంతయు నాముని మనస్సునందు ప్రత్యక్షమైనదన్న మాట-ఆవాల్మీకి

జారులుఁ కొట్టడానికి సాయంసమయమున జుట్టువిరబోసికొని శంభునివలె గంతులు వేయును. ఈవాక్యము. "సాయంతాండవసంభ్రమాయుజటి నేసేయం సతీశ్శంభవే" అన్న దానికర్థము.

కశ్య—ఓరీ! నీ తెలివి తెల్లవార! ఏమి అర్థమురా! ఇంత మందమతి వేమి?

గాల—(నవ్వుచున్నాడు)

జాబా—మహాత్మా! ఇఁక నాకీ విద్య వలన లాభములేదు. గాని, ఆతుకపిత్వము - చెప్పుట నేర్పుదురా? అదివస్తే "మంచివాఁడవు నీవయ్యా మల్లిసెట్టి" అని చెప్పుచు బయలు దేరినచో లాభముండును - (ఇంచుక యూరకుండి) అదికాదు! ఆతుకపిత్వంలో పటుత్వంలేక పోతే అందఱును దూషింతురు. కావున భూత వైద్యము నేర్పుడు. కొంచెము విభూతిబెట్టుచుఁ బొట్టఁబోసికొందును.

(అదితి ప్రవేశము)

అదితి—(తనలో) ఇదిగో! తపః ప్రభావ సంపన్నుఁడగు మన్నాథుఁడు శిష్య సహితుఁడై యాశ్రమమునందే యున్నాఁడు. పోయి దర్శించెదఁగాక! (కశ్యపుని సమీపించి) ప్రాణేశ్వరా! నీ చరణసరోరుహంబులకీసేవకురాలు నమస్కరించు చున్నది (నమస్కరించును)

కశ్య—(ఆశ్చర్యముతో) కల్యాణీ! ఎచ్చటనుండి నీరాక!

అది—దేవా! నాయవస్థ నేమని విన్నవింతును.

కశ్య—నీరాక నా కెంతయు నద్భుతముఁ గొలుపుచున్నది. గజగవయగండభేరుండగండకకంఠీరవవ్యాఘ్రశరభసైరిభ మహాజంతుసంతానాకుంఠితకంఠకుహరవినిర్గతక్రూరనిర్ఘోషభీషణంబును,శిశా

ఖగనివహారాడంబరదంతురంబును, జంబుజంబీరనింబతరుస్యందన మందారకందరాలపలాశన్యగ్రోధాశ్వత్థాదివసుధారుహపటలాభ్రంకషంబును, నిశాతస్థూలకంటకపాషాణశ్రేణివ్యావృతంబును, కలరవఖంజరీటశ్యేనచటకకలకంఠప్రముఖనిఖిలఖగకులధ్వానసంకులంబును నై యొప్పుచు దినేశరుచులు జొరనీక, చీకటులుగ్రమ్ముకొని యిసుకఁజల్లినరాలకుండ బరిక, చిర్రేగు, గచ్చ, కసింద, కోరింద కంపల గలయుం బెనుచుకొని, తెరవరయ వశంబుగానీక యల్లికలఁ బెల్లుకటంబై దురవగాహస్థితి నతిశయిల్లు మహారణ్యం బెట్లు గడచివచ్చితివి?

గాల—(జాబాలిని జూచి రహస్యముగా) ఈమె మన గురువుగారి భార్యయైనది యదితిదేవి. అమరమాత.

జాబా—ఈమె మనకు పూజ్యురాలు. నమస్కరింపవలయును.

(గాలవుఁడును జాబాలియు నదితికి నమస్కరింతురు.)

అది—(కశ్యపునిఁ జూచి) నాథా! పరితాపముచేఁ బీడింపఁబడుచుండు దేహము గట్టులను, పుట్టలను, భయదాటవులను లెక్క్య పెట్టదు.

కశ్య—మహాతపఃప్రభావసంపన్నుఁడగు ఈకశ్యపునకు భార్యవైన నీకు; త్రిభువనాధీశ్వరుండైన మహేంద్రునకు మాతవైన నీకు; పరితాపంబునకుఁ గారణమేమి?

మ. తెఱవా! విప్రులు పూర్ణులే జరుగునే ◆ దేవార్చనాచారముల్
తతితో వేలుతురే గృహస్థులు సుతుల్ ◆ ధర్మానుసంధానులే
నెఱి నభ్యాగత కోటికన్న మిడుదే ◆ నీరంబునుం బోయుదే
మఱలే కర్షుల దాసులన్ సుజనులన్ ◆ మన్నింపుదే పైదలీ.

ఆ. అన్నమైనఁ దక్ర ◆ మైనఁ దోయంబైన
శాకమైనఁ దనకు ◆ జరగుకొలఁది

సతిథి జనులకడ్డ ♦ మాడకయుడ లేని
లేమ వారు కలిగి ♦ లేనివారు.

రమణీ! శ్రీమన్నారాయణునకు భూమీసురు లన్నఁ బ్రీతి యెక్కువ. బ్రాహ్మణులను పూజించు పుణ్యాత్ములా మహాత్మునకుఁ బరమభక్తులు. బ్రాహ్మణులు సంతుష్టిఁబొందిరేని యా దేవదేవుఁడు సంతుష్టిఁబొందును. నీవు బ్రాహ్మణులను పూజించుచుందువుగదా! పాకశాసనునకు భద్రమేగదా! తత్సతీమణియు, మహాసాధ్వియు నగు శచి నీయందు భక్తిఁబూని వర్తించును గదా! జయంతకుమారుఁడు కుశలియే!

అది—అందఱును గుశలముగ నున్నారు.

కశ్య—అట్లయిన నీకుఁ బరితాపమునకుఁ గారణమేమి?

అది—దేవా! ఏమని చెప్పుదును! క్షీరసాగర మథనసమయమున మహేంద్రునిచే నోడింపఁబడి, తనవారితోఁ బశ్చిమశిఖరి శిఖరంబుఁ జేరిన బలి, శుక్రాచార్యానుమతంబున విశ్వజిద్యాగంబుఁ గావించి, భుజబలపరాక్రమంబున గర్వించి, యమరావతి నాక్రమించినాడు.

సీ. ఎందఱెన్నఁగని ♦ యింద్రుని యిల్లాలు
వలువంచలను జాలిఁ ♦ బడియెనేఁడు
త్రిభువన సామ్రాజ్య ♦ విభవంబుఁ గోల్పోయి
దేవేంద్రుఁడడవుల ♦ దిరిగెనేఁడు
గలిమిగాఁ బాలు బిడ్డలు జయంతాదులు
శబరార్భకులవెంటఁ ♦ జనిరినేఁడు
నమరులకాధార ♦ మగు నమరావతి
యసురుల కాటప ♦ ట్టయ్యె నేఁడు

ఆ. బలి జగములనెల్ల ♦ బలియుచునున్నాఁడు
వానిగెలువరాదు ♦ వాసవునకు
యాగభాగమెల్ల ♦ నతఁడాహరించును
గడఁగిసురలకొక్క ♦ కడియునీఁడు.

సీ. అడుగేనిఁ బెట్ట శక్యముగాని భీకరా
రణ్యముల్ మణిమంది ♦ రంబులయ్యె
కడుభీతిఁ గలిగించు ♦ కాననమృగములు
ఘనపరిచారికా ♦ జనములైరి
కడుపుమంటను ద్రావు ♦ కాసారజలంబులు
సరసభక్ష్యాన్న ర♦సంబులయ్యె
కఠినశిలాయుక్త ♦ కంటక భూములే
బహుసౌఖ్యమిచ్చు త♦ల్పంబులయ్యె

తే. కటకటా యెట్టి ఘోరసం ♦ కటముగలిగె
నమరనాథున కబ్బలి ♦ యమరపురిని
గ్రౌర్యమున నాక్రమించిన ♦ కారణమున
భావమునఁ జేర్చవే దీని ♦ నీవు నాథ.

మ. కకుబంతాధిప దివ్యరత్న మకుటా ♦ గ్రస్థాపనీభూత బీ
తికరోద్దీపిత శాసనుండయిన యా ♦ దేవేంద్రుఁడట్టుల్ శచీ
చకితాక్షీమణిఁ గూడి కానల నవ ♦ స్థల్ బొందఁగానయ్యె నీ
వికనేరీతిని వారలన్ మనుపఁ బ్రా♦ణేశా! మదిన్ జూచెదో.

అమరేంద్రుఁ డాలుబిడ్డలతోఁ బడుచున్న దుర్భరకష్టంబులను నేను చూడఁజాలక యున్నాను.

సీ. ధన్యసంప్రాప్తను ♦ ధర్మసింహాసనా
స్థానభాగ్యగరిమ ♦ సన్నగిల్లె

నవకల్పభాసిత ♦ నందనానందని
　　　　ర్బలవిహారసుఖంబు ♦ సమసిపోయె
రమణీయనిర్మల ♦ ప్రతిభాధురీణ ది
　　　　క్పాల సంసేవలు ♦ నేలఁగలిసె
ఐరావతోచ్చైశ్శ్ర ♦ వాదిసద్వాహన
　　　　స్వర్గసంచారముల్ ♦ జలధిఁబడియె

తే. దివ్యచింతామణీకామ ♦ ధేనుపారి
జాత విభవముల్ దివ్యప్ర♦వంతిఁడాఁగె
పటుపరాక్రమ విక్రమ ♦ ప్రాభవంబు
లజుని మాయచే లోలోన ♦ నడఁగియుండె.

కశ్య—సతీమణీ! తపోవృత్తినున్న నన్నింకను ఇట్టి చింత లప్పుడప్పుడు
బాధించుచునే యున్నవి. విధికృతము నెవ్వరును దప్పింపఁ
జాలరు.

అది—దేవా! అట్లని యూరకుండఁగలనా!

మ. సురలన్ సభ్యుల నార్తులన్ విరథులన్ ♦ శోకంబు వారించి,ని
ర్జరధానిన్ నిలుపంగ రాత్రిచరులన్ ♦ శాసింప సత్కార్యమీ
వెర వేరీతి ఘటిల్లు నట్టి క్రమమున్ ♦ వేగంబ చింతింప వే
కరుణాలోక సుధార్ఘరిందనుప వే ♦ కల్యాణ సంధాయకా.

నీవు తలంచుకొన్నచో నెట్టికార్యమునైనను సేయఁగలవు. మహా
తపస్సంపన్నుఁడవగు నీకు శక్యముగానిదేమున్నది?

కశ్య—

మ. జనకుండెవ్వఁడు జాతుఁడెవ్వఁడు జన ♦ స్థానంబు లెచ్చోటు సం
జననంబెయ్యది మేను లేకోలది సం ♦ సారంబు లేరూపముల్

విశ్వమా యింతయు విష్ణుమాయఁ దలఁపఁగ వేఱేమియుఁ లేదు మో
హనిబంధంబు నిధానమింతటికి జాయాపిన్నఁ బోనేటికిఁ.

అయినను నిందులకుఁ గర్తవ్యము వక్కాణించెదను.

ము. భగవంతుం బరముం జనార్దనుఁ గృపాపారీణు సర్వాత్మకున్
జగదీశున్ హరిసేవ సేయుమతఁడున్ సాంగత్యముం బొంది నీ
కగు నిష్టార్థము లెల్ల నిచ్చు నిఖిలార్థావాప్తి నీకూ రెడిన్
భగవత్సేవఁ బొందరాదె బహు సౌభాగ్యంబులం బ్రేయసీ.

ఇప్పట్టున నీపరితాప దవానలం బార్పఁగలిగినవాఁడు భగవంతుఁడగు శ్రీమన్నారాయణుఁడే. నీ వాతనిని సేవింపుము. నీమొదలఁ బ్రసన్నుఁడగును.

అదితి—పరమనిష్ఠాగరిష్ఠత్వమున ఘోరకాననంబులయందుఁ బెక్కు సంవత్సరములు తపంబొనర్చు మహాయోగులకే యుద్దేవుఁడు ప్రసన్నుఁడగుట కష్టమని విందును. అట్టిచో—అబల—జ్ఞానహీనను—అగు నాకాతఁ డెట్లు ప్రసన్నుఁడై—పరితాపము వాపును ?

కశ్య—శ్రీమన్నారాయణుఁ డార్తత్రాణ పారీణుఁడు భక్తపరతంత్రుఁడు కరుణాసముద్రుఁడు. నీ వా మహాత్ముని సేవించుటకుఁ దగిన మార్గము చెప్పెదను. పయోభక్షణంబను నొకవ్రతంబున్నది. హరిసమర్పణంబుగా నీ వా వ్రతమును పండ్రెండు దినములు సేయవలయును. ఆమంత్రింబును దద్విధానమును, దదుపవాస దాన భోజన ప్రకారంబులను నెఱింగించెదను. రమ్ము.

(కశ్యపుఁడును అదితియు నిష్క్రమింతురు.)

జాబా—ఇఁక మనము గూడఁ బోయి భోజనము సంగతిఁ జూచుకొందము. భోజనము చేసిన తరువాత వనములోనికిఁ బోయి

కొంచెపు సేపు అశోకవృక్షము క్రింద విశ్రమించవలెను. అదితి దేవి వచ్చుట నాకుఁ జాల యానందముగ నున్నది.

గాల—ఎందుచేత,

జా·బా—ఏమున్నది? అమరలోకమును అసురలు ఆక్రమించి రని చెప్పుటకుఁ గదా ఈమె వచ్చినది. ఆమె కేదో యొక దారి జూపినఁగాని, గురువుగారు మన పాఠములను సరిగాఁ జూడరు.

గాల—అందుకనియా నీకానందము. సరేలే. రా!

(నిష్క్రమింతురు)

రంగము—(వనము తపస్సునందుండు అదితి ప్రవేశము)

అది—(తనలో) నేడే నావ్రత సమాప్తి దినము. జగదీశ్వరుండగు శ్రీహరి యికఁ నాయెడల నెట్లు కృపఁ జూపునో! (కన్నులు మూసి కొని) సకలామరశిరోమకుటరత్నప్రభాభాసమానపద పంకేరుహా? సంసారార్ణవకర్ణధారా! లక్ష్మీనయనోత్పలపూర్ణ చంద్రా! ప్రావృడ్ఘన శ్యామలా! శ్రీమన్నారాయణా!

(విష్ణుమూర్తి ప్రవేశించుచున్నాఁడు)

విష్ణు—(తనలో) ఈమె నాకరుణ నాశించి కఠిన నియమములతో నన్ను గొల్చుచున్నది. నేనికఁ నీమెకుఁ బ్రసన్నుఁడ నయ్యెదఁగాక. (సమీపించి) అమరమాతా! అదితీ!

అది—(కన్నులు తెఱచి చూచి లేచి-తనలో) ఆహా! నాభాగ్యము. (శ్రీహరిపాదములకు నమస్కరించి) సకల భూతంబులకు నంతర్యామివైన నీకు నమస్కరించుచున్నాను. కల్పాంతసమయమందు నఖిల ప్రపంచము నాహరించి శేషపర్యంక తలమున యోగనిద్రాసక్తినుండి, నాభీకమలము నుండి చతుర్ముఖుని బుట్టించిన యాది దేవుఁడవగు నీకుఁబ్రణతులర్పించుచున్నాను.

దేవా! నిన్నుఁ దమ హృదయ పీఠంబులయందుఁ బాదుకొల్పి
తమసర్వస్వము నీకర్పించి యనేకులు కృతార్థులగు చుండిరి.
శరణాగత త్రాణ బిరుదాంకితుఁడవగు నీవును వారి చిత్తముల
యందు వసించుచు వారి కామ్యములఁ దీర్చుచుందువు. జగ
న్నాయకా! కామ క్రోధలోభ మోహ మద మాత్సర్యములను
జయించి, సత్కర్మనిరతులై పురనగర గ్రామంబులఁ బరిత్య
జించి పర్వతారణ్యముల సంచరించుచు, శరీరధారణార్థము,
స్వల్ప భోజనులై మోదఖేదంబులు సమముగ భావించి, నిర్జి
తేంద్రియులై పవిత్రాంతఃకరణులైన యోగీశ్వరులు గూడ
నొక్కొక్క సమయమున నీమహిమ నెఱుగఁజాలరు. భవన్నామ
సంకీర్తనము జగన్మంగళము. జగన్మోహనము. జగజ్జేగీయ
మానము. నిఖిలపాపైక నిష్కృతి-సకలదుఃఖనివారణము-దారి
ద్ర్యవిచ్ఛేదకము- ఓలక్ష్మీకళత్రా! పరితాప వార్ధియందు
మునింగిన నేను-పద్మాంకుశచాప చక్రమత్స్యరేఖాలంకృతమైన
నీపదములను-సనకాది యోగీంద్ర హృదయ సంస్థాపితమైన
నీపదములను-శ్రుతివధూ సీమంతవీథులఁ జెన్ను మిగులు నీపద
ములను, సమస్తకలుషవిభంగయగు గంగాభవానికి జన్మస్థలంబైన
నీపదములను, ముక్తికాంతామనోమోహనమైననీపదములను,
బ్రహ్మేంద్రాది బృందారకప్రముఖ కిరీటరత్నరుచిదీపితములగు
నీపదములను, ఆశ్రయించితిని. యోగీంద్రులకైనను దుర్లభ
మైన భవదీయ దివ్యమంగళ విగ్రహసందర్శనము మదీయ
పూర్వపుణ్యవశమున లభించినది. దేవా! రక్షింపుము.

విష్ణు—సాధ్వీమణీ! అదితీ! నీయభీష్టము నేనెఱుంగుదును. ఇప్పుడు బలి
దేవధానినధిష్ఠించి,విశ్వవిజయుఁడై రాజ్యము బాలించుచున్నాఁడు.

అతఁడు సత్యసంధుఁడు. ధర్మపథానువర్తి. అనేకాశ్వమేధంబులు గావించినాఁడు.

శా. అర్థుల్ వేఁడరు దాతలుం జెడరు స ♦ త్త్వారంభముల్ పండు ప్ర
త్యర్థుల్ లేరు, మహోత్సవంబులను దే ♦ వాగారముల్ వొల్పుఁ బూ
ర్ణార్థుల్ విప్రులు, వర్షముల్ గురియు గా ♦ లార్హంబులై ధాత్రికిన్
సార్థంబయ్యె వసుంధరాత్వము సురేం ♦ ద్రాధీశు రాజ్యంబునన్.

సద్గుణవర్తనుఁడగు నాబలి నెట్లు వంచింపఁగలను? అతని రాజ్యశ్రీల నెట్లు హరించి మహేంద్రునకుఁ గూర్తును ?

అని—

సీ. యజ్ఞేశ విశ్వంభ ♦ రాచ్యుత శ్రీరమణామం
గళనామధేయ, లో ♦ కస్వరూప
యాపన్నభక్తజ ♦ నార్తివిఖండన
దీనలోకాధార ♦ తీర్థపాద
విశ్వోద్భవస్థితి ♦ విలయకారణభూత
సంతతానంద శ ♦ శ్వద్విలాస
యాయువు గేహంబు ♦ ననుపమలక్ష్మియు
వసుధయు దినము త్రి ♦ వర్గములును

తే. వైదికజ్ఞానమును ముక్తి ♦ వైరిజయము
నిన్నుఁ గొలువని నరులకు ♦ నెఱయఁ గలదె
వినుతమందార గుణహార ♦ వేదసార
ప్రణతవత్సల పద్మాక్ష ♦ పరమపురుష.

ఆ. అసురవరులు సురల ♦ నదలించి బెదరించి
నాకమేలుచున్న ♦ నాటనుండి

కన్నకడుపుగాన • కంటఁగూరుకురాదు
కడుపుబొక్కు మాన్పి • కావవయ్య.

(శ్రీహరి పాదములపైఁబడును)

విష్ణు—అదితీ! లెమ్ము. లెమ్ము. (ఇంచుకయాలోచించి)నీవువిచారింపకుము. కృతార్థురాలవు కాఁగలవు.

శా. నీకోడండ్రును నీకుమారవరులున్ • నీనాథుఁడున్నీవు సం
శ్లోకింపన్ సతులుంబతుల్ మిగులన • మ్మోదింపరాత్రించరుల్
శోకింపన్ భవదీయగర్భమున దే • జోమూర్తి జన్మించెదన్
నాకున్ వేడుకపుట్టనీసుతుఁడనై • వర్తించివర్తింపఁగాన్.

మ. బలిమిన్ దైత్యులఁ జంపరాదు వినవో • పాతుంబునంగాని సం
చలనం బొందకు నేను నీనియతికిన్ • సద్భక్తికిన్ మెచ్చితిన్
బలివిద్వేషణుడున్ నిలింపగణముం • బౌలోమియున్ మెచ్చదై
త్యుల రాజ్యంబు హరింతు నిందునికిని • త్తున్ దుఃఖమింకేటికిన్.

నారూపమును మానసించి నీవు నీరమణుని సేవింపుచుండుము.

నేను నీకు నందనుఁడనై దానవుల భాగ్యశ్రీల హరించి,మహేంద్రునిచే నమరావతిని నేలింతును.

(అదృశ్యుఁడగును)

అదితి—(సంతోషముతో) నేనొనర్చిన వ్రతము ఫలించినది. అఖిల జగన్నియామకుఁడగు శ్రీమన్నారాయణుఁడు నాగర్భాగారంబును బ్రవేశింతునని పలుకుట నాపూర్వపుణ్యము కదా! నేనిప్పటికిఁ గృతార్థురాలనయితిని. ఇక నీశుభవార్తఁ బ్రాణేశ్వరున కెఱిఁగింప డెందము తొందరపడుచున్నది.

(నిష్క్రమించును.)

(రంగము—(వనము-గాలవుఁడు ప్రవేశించును.)

గాల—(తనలో) ఆహా!

సీ. ఇంద్రనీలచ్ఛాయ • నేలు దేహంబుపైఁ
గనకచేలప్రభఁ • గ్రాలువాఁడు
వజ్రపంజరనిభం • బైన వక్షంబున
వైజయంతీమాల • వరలువాఁడు
పాదసన్నిధియందు • భక్తినాసీనయౌ
శ్రీదేవిసేవలఁ • జెందువాఁడు
సాధురక్షణములో • చక్కనికరముల
వరశంఖచక్రముల్ • బట్టువాఁడు

తే. శేషపర్యంకమున విల • సిల్లువాఁడు
నాదిమధ్యాంతరహితుఁడై • యలరువాఁడు
నఖిలభువనములకుఁ గర్త • యైనవాఁడు
నదితి దేవికిఁ దనయుఁడై • యలరినాఁడు

అదితి కశ్యపుల భాగ్యమే భాగ్యము! సాక్షాద్రమానాథుని నందనునిగాఁ బడయుట కదితి పూర్వజన్మంబున నెట్టిసుకృతము జేసెనో కదా! (ఇంచుక యూరకుండి) మఱచితిని. నేనిచ్చట నాలస్యము సేయ రాదు. భగవత్పూజార్థము పుష్పంబులఁ దెమ్మని గురుఁడు నన్ను నియమించినాఁడు కావున సత్వరముగ బోవలయును.(కొంచెము నడిచి పుష్పములఁ గోయుచున్నది.)

జాబాలి—(ప్రవేశించి తనలో) గురుసన్నిధిఁ బాసి పెక్కు దినంబులయ్యెను. నాసహపాఠియగు గాలవుఁ డిచ్చట నుండెనో లేదో! (ఎదుట జూచి) ఇదిగో! గాలవుఁడిచ్చటనే ప్రత్యక్షమైనాఁడు. (గాలవుని జూచి) మిత్రుడా !

గాల—మిత్రుఁడా! ఎప్పుడు వచ్చితివి?

జా బా—ఇప్పుడే వచ్చుచున్నాను.

గాల—ఇంటియొద్దనే యున్నావు ఎవ్వడు ఆలస్యము చేసితివేమి? గురుఁడు నిన్నుఁ దలంపని దినమే లేదు.

జా బా—త్వరలో రావలయుననియే యరిగితిని. కార్యాంతరములచే నాలస్యమైనది. ఇంటికి వెళ్ళునప్పటికి నాకు వివాహసంబంధములు వచ్చినవి. విద్యాభ్యాసము పూర్తియైనఁ గాని వివాహము చేసికొనననని చెప్పినాను కాని మా తలిదండ్రులు బలవంతపఱచుట చేతను, వెదకకుండా లభించిన సంబంధమగుటచేతను, సమ్మతించితిని. ముందు సంవత్సరములోఁ గాని పెండ్లి జేసికొనననని చెప్పినాను. తాంబూలములు పుచ్చుకొనుట జరిగినది. (ఇంచుక యూరకుండి) ఈసంగతులకేమి గాని యాశ్రమమున విశేషము లేమి?

గాల—గొప్పవిశేషములే యున్నవి. వచ్చితివిగా! అన్నియుఁ దెలియును. రా! పోదము.

జా బా—(ఆతురతతో) ఆవిశేషము లేవో చెప్పుము. వినుటకుఁ జిత్తము తొందరపడుచున్నది.

గాల—

మ. రవిమధ్యాహ్నమునం జరింప గ్రహతా ♦ రాచంద్రభద్రస్థితిన్
శ్రవణద్వాదశినాఁడు శ్రోణసభిజి ♦ త్సంజ్ఞాతలగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం ♦ బుణ్యవ్రతోపేతకున్
దివిజాధీశ్వరుమాతకుం బరమపా ♦ విత్ర్యవిఖ్యాతకున్.

జా బా—ఆహా! శ్రీమన్నారాయణుఁడు వామనుడై యదితి గర్భంబున జన్మించెనా! మా గురువుగారి భాగ్యముకదా! ఆసమయమున నిచ్చటికి సకల మునీంద్రులును వచ్చియుందురు.

గాల—మునీంద్రులారా! పార్వతీ పరమేశ్వరులు-సరస్వతీ చతుర్ముఖులు సకలఋషులు-కుబేరుఁడు మొదలైనవారు వచ్చిరి. "శంఖచక్ర గదాకమల కలిత చతుర్భుజుండును, బిశంగ, వర్ణవస్త్రుండును మకరకుండలమండిత గండ భాగుండును శ్రీవత్సవక్షుండును, నలిన చక్షుండును, నిరంతర శ్రీవిరాజిత రోలంబకదంబవిలంబిత వనమాలి కాబరిష్కృతుండును, కనక కంకణకాంచీ కిరీట వలయాంగదనూపు రాలంకృతుండును, కమనీయకంఠ కౌస్తుభా భరణుండును, నిజజనమనోహరుండును" నై యవతరించిన యా శ్రీహరి కొంతసేపటికి, యారూపము నుజ్జగించి, కపట వటుని చందమున నుపనయన వయస్కుండై గనుపట్టె.

జాబా—వామనునకు నుపనయనము గూడ గావించిరా యేమి?

గాల—మహర్షులెల్లరును కశ్యపమునీంద్రునిఁ బురస్కరించికొని, యక్కుమారునకు సముచితోపనయన కర్మ కలాపంబులు గావించిరి. "సవిత సావిత్రి నుపదేశించె, బృహస్పతి యజ్ఞోప వీతంబును, కశ్యపుఁడు ముంజియు, గావీనంబదితియు, ధరణి కృష్ణా జినంబును, దండంబు వనస్పతి యగు సోముండును, గగనాధిష్ఠాన దేవత ఛత్రింబును, కమండలువు బ్రహ్మయు, సరస్వతి యక్ష మాలికయు, సప్తఋషులు కుశపవిత్రింబునునిచ్చిరి. కుబేరుఁడు భిక్షాపాత్రినొసంగఁగా నందు పార్వతి యక్షయ మని వడుగు నకుఁ భిక్షఁబెట్టెను.

జాబా—ఇట్టి మహోత్సవ సమయంబున నేను లేక పోయితినిగదా! ఉన్నచో తత్సందర్భమున వచ్చిన బ్రహ్మాదులను నాకు విద్య బాగుగ వచ్చు మార్గము జెప్పుడని యడిగి యుందును.

గాల—సరేలే! రా! ఈవృక్షములు గురువుగారి కొసంగవలయును.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.



దాం న[illegible]బ[illegible]లి.

—: తృతీయాంకము :—

రంగము—[అమరావతి—నందనవనంబున సంధ్యావళియుఁ జెలికత్తెయగు ప్రియంవదయుఁ బ్రవేశించుచున్నారు]

ప్రియం— దేవీ! ఈ వనంబును గంటివా! ఎల్లెడ నల్లిబిల్లిగ నల్లుకొన్న పొదరిండ్ల క్రిందనున్న మల్లెమొల్లములును హృదయాహ్లాదకరములగు జాజులును, ఘుమ్మ ఘుమ్మని కమ్మని తెమ్మెరలఁ జిమ్ము సంపెఁగలును, మదనుని చేతినుండు ఖడ్గమును సానఁబట్టు ననుపయిన పలకరాళ్లోయనఁ దగు గేదంగులును, మార్గాయాస సంజనితతృష్ణా విదారణ కారణంబులగు నారికేళ వృక్షములును, భూర్జకర్జూరపనసనింబాదిబహువిధభూజఁబులును విమలసలిలాసార పూరితములగు సరోవర్గంబులును, నాసరోవర తీరంబుల మత్స్యంబులఁ బట్టుటకై దొంగ జపంబాచరించుచు వేచియుండు బకఁబులును, ముద్దు పలుకుల నల్లంబులరంజిల్లఁ జేయు శుకంబులును, కుహూకుహూధ్వానములు సేయు పికఁబులును, బురులు విచ్చి యాడుచుఁ దమన ఖంబులచే సర

బులఁ జిల్చి యొడిసి పట్టుకేకి సముదయములును గలిగి
యలరుచున్న ఈనందన వనరామణీయత మనకు నేత్రపర్వ
మొనర్చుచున్నది.

సంధ్యా—(కొంచెము నడిచి) ప్రియంవదా! ఈరసాల భూజమెంత
చక్కగ నున్నదో చూడుము?

సీ. చిగురు జొంపముల మె ♦ చ్చికఁ దిన నలవడి
కోయని కోకిలల్ ♦ కూకలిడిరె
గమగమ వలచు చ ♦ క్కని పూవుగుత్తులఁ
జూచి తుమ్మెదలు జుం ♦ జుమ్మ్మనిరె
వలకఁబాఱిన తీయ ♦ పండ్లనురుచిఁ జూచి
చిలుకలు పలుకుల ♦ కులుకు లండె
నీడంబులన్ బసి ♦ నిసువుల మేపుచుఁ
దద్దయు గువ్వలు ♦ ముద్దులాడె

తే. గీ. కోటరంబుల ఘూకముల్ ♦ గుఱ్ఱువెట్టె
గొనల జక్కనల్ పొరిఁబొరి. ♦ గూర్మిఁగాంచె
నచ్చటచ్చట శారికల్ ♦ ముచ్చటించె
దాన సహకార నామంబు ♦ ధన్యమయ్యె.

ప్రియం—(ఎదుటఁ జూపుచు) ఈ ప్రక్కనున్న కోనమాత్రము గమన
దుస్సహమై యున్నది. చూడుము.

సీ. అల్లిబిల్లిగనల్లు ♦ వల్లీమతల్లుల
కెల్లసిళ్ళగు పొద ♦ రిండ్ల పెల్లు
జిగిబిగి గరితోడ ♦ మిగులు ముండ్లును నాగు
లగపడఁ బూసిన ♦ మొగలిడొంక

లటమట నటియించు • పటుకీచక వంశముల్
పెటలంగ మ్రోసెడు • వెదురు బిళ్లు
నిలువెల్లఁ గంటకా • న్వితములై పుష్పించి
పోఁబోవ నడ్డుగు • లాబిచెట్లు
తే. నీరుచోఁ గ్రుచ్చుకొను పుల్ల • రేగుతుప్ప
లిక్కడక్కడ నెక్కొను • రక్కసిపొద
లొల్లమాలిన పల్లేరు • పల్లికలును
జేరరానీవు పాంథ వి • హారములను.

సంధ్యా— చెలీ! మన మాప్రక్కకుఁ బోవుదము - (కొంచెమునడిచి) అటుఁజూడుము.

ఉ. ఉన్నత శైలకంధరము • నుండి ఝుఝరంబదె సానుపంక్తి వి
ద్యున్నవరేఖ కాంతులను • నొంది దరీముఖ పాళిశీకరో
ద్భిన్నత ఫేనపుంజముల • బెంచి వడిన్ విపరించిలోతు పిం
పెన్నఁగ రాక జారి పడు • నీకొల నెంతయు మోదమిచ్చెడిన్.

(మఱియొక దెసకునడిచి)

మ. ఒకచో మల్లియ పందిరుల్ విరియఁ బూ • గున్ తోఁనె మందానిలా
త్మకపీడన్ విరువెల్ల రాలిపఁ జ • త్రంబైన నేలొక్కటన్
బ్రకట ప్రాభవ పక్వబాధ కశాసన్ • ద్రాక్షాగుళుచ్ఛంబులిం
చుక మందంబది రసప్రవాహదటచుక్ • జూపించు బాంధాళికిన్.

ప్రియం— అమ్మా!

చ. మలయగిరిన్ వసించి యల • మావస దివ్య సరంబునీది యా
వలమలి నాటలాడి సన • పల్లవపాళిఁ గదల్చి మల్లికా
కలవకులామ్ర కేతకుల • కూటములందు మరంద మాని మ
త్తిలి ఘనసారవాసనలఁ • దేలి సమీరుఁడు వీచె మెల్లఁగన్.

కావున మనమూజలజాకరతీరంబునఁ జంద్రకాంత శిలపైఁ గూర్చుందము.

(ఇరువురును కాసారతీరమునఁ గూర్చుందురు)

సంధ్యా—రమణీ! ఈలోకము భూలోకము కంటెఁ గడుసౌందర్యముగ నుండెను సుమా!

ప్రియం—నిజము. అందులకనే మహేంద్రుఁడీ యమరావతినివిడిచిపోవు నప్పుడు కన్నుల నీరుగార్చినాఁడట! (ఎదుటజూచి) అమ్మా! దానవలోక సార్వభౌముఁడిట్లు వచ్చుచున్నాఁడు (లేచును)

సంధ్యా—(లేచి) అవునే! ఈయన యిచ్చటికేల వచ్చుచుండెనో!

(బలి ప్రవేశించును)

సంధ్యా—(బలిని సమీపించి) నాథా! నీపాదకములకు సేవకురాలు నమస్కరించుచున్నది. (నమస్కరించును)

బలి—తరుణీమణీ! నందన వనవిహారమునకు వచ్చితివా! నీ విచ్చటకు వచ్చితివని నేనెఱింగియే యిట్లు వచ్చితిని. ఇఁట గూర్చుండుము (ఆసీనుఁడగును)

ప్రియం—(పోఁబోవును)

బలి—(ప్రియంవదనుజూచి) ప్రియంవదా! నీవరిగెద వేమి; ఇటనుండుము నాకేమియు మీ దేవితో రహస్య సంభాషణము లేదు. (సంధ్యావళిఁజూచి) రమణీ! అతిథి- అభ్యాగతులను- బూజించుచుంటివి కదా! బ్రాహ్మణులను సత్కరించుచుంటివా! (ఇంచుకయూరకుండి) ఇంతకు ముందు మన వంశములోని వీరులందఱును గ్రూరకర్ములఁ జేసి, శౌర్యమూర్తులయినను దమ యధర్మముచే నశించిరి. కావున మనము అధర్మమునకుఁ జిత్తముల యందు

స్థానమీయరాదు. నీవు నిరంతరము దేవతారాధనములు, బ్రాహ్మణపూజలు గావించుచుండవలెను. ధర్మమే నన్నుఁ త్రిభువనాధీశ్వరునిగా నొనర్చినదని గ్రహింపుము. మనము దైత్యులమేయైనను, నాకు భగవంతునియందు ద్వేషము లేదు.

మ. పరమాత్ముండజుఁడీజగంబుఁ బ్రతిక ♦ ల్పంబందుఁ గల్పించుఁ దా
బరిరక్షించును ద్రుంచునట్టి యనఘున్ ♦ బ్రహ్మాత్మసిత్పూర్ణ జగ
ద్భరితున్ గేవలు నద్వితీయుని విభు ♦ ద్ధజ్ఞాను సర్వాత్మ నీ
శ్వరు నాద్యంతవిహీను నిర్గుణుని శ ♦ శ్వన్మూర్తిఁ జింతించెదన్.

సంధ్యా—దేవా! జగదేక పరాక్రమ విక్రముండవును, సత్యవ్రతాచార పారీణుఁడవును, నిరంతర దానకంకణ విరాజితుఁడవును నగు నీవు నా పూర్వసుకృతంబునఁ బతివైతివి. అట్టిచో నాకుఁ గొఱంత యేముండును. సంతతము నా చిత్తము ధర్మపథంబునందే తగిలియుండునని విన్నవించుకొనుచున్నాను.

బలి—నీకు సమస్తము తెలియును. అయినను చెప్పుచుంటిని. మున్ను మా ప్రపితామహుఁడు మొదలగు వారందఱును భుజబలంబున గర్వించి, కన్నుమిన్నును గానక చరించి నశించిరి. చూడుము. మహాత్ముండగు శ్రీమన్నారాయణుఁడు,

మ- కనకాక్షుండు భుజావిజృంభణమునన్ ♦ క్ష్మాచక్రమున్ జాపఁ జు
ట్టినమాడ్కిం గొనిపోవ యజ్ఞమయుఁడం ♦ ప్ట్రిత్యాకృతిం దాల్చి య
ద్దనుజాధీశ్వరుఁ దాకి యబ్ధినడుమన్ ♦ దంష్ట్రాహతిన్ద్రుంప ధా
త్రిని గూలెంగులిశాహతింబడు మహా ♦ ద్రింబోలినత్యుఁగ్రతన్.

మ. సురలోకంబుఁ గలంచి దేవసమితిన్ ♦ స్రుక్కించి యుద్యద్గదా
ధరుఁడై వచ్చు నిశాచరుంగని కన ♦ ద్దంష్ట్రాకరాళాస్య వి

స్ఫురిత భ్రూకుటితో నృసింహాకృతి ర • క్షోరాజవక్షంబు భీ
కరభాస్వన్నఖరాజిఁ జీల్చెఁ ద్విజగ • త్కల్యాణసంధాయియై.

ఇట్టివన్నియు నీవు వినియే యుంటివి. ఆ శ్రీహరిలీల లగణ్యములు. ఆ మహాత్ముని దివ్యప్రభావ మెవ్వరును గనుఁగొనఁజాలరు. ఆ దేవదేవుని మాయ నెవ్వరును దాటఁజాలరు. అతఁ డెప్పుడును అధర్మపరులనాశన మొనరించుటకే యవతార మెత్తుచుండును. భక్తితోఁ దన్ను సేవించువాఁడు చండాలుఁడైనను నాతఁడనుగ్రహించును. ఈ కారణముచేతనే నేను భగవత్ప్రీతిగ దానములు సేయుటయుఁ గ్రతువు లొనర్చుటయు నని నీవు తలంపుము. ధర్మము వలన దేహధారికి యశము గలుగును. ఆయశమే యాచంద్రార్క తారాపనీశరధిస్థాయిగ నుండును.

సంధ్యా—నాథా! నర్మదానదీతీరమున నీవొక యాగము సేయ సంకల్పించితివే! అది యెప్పుడు జరుగునో వినవచ్చునా?

బలి—సమయమునకే ఈ సంగతి జ్ఞాపకము జేసితివి. ఈవిషయమును గూర్చి యోచించి, తగునేర్పాటులు జేయుటకు మనగురుండ యిన శుక్రాచార్యుని రమ్మని ప్రార్థించి యున్నాను. అతఁడు వచ్చియుండును. నేనేగవలయును. (ఇంచుక యూరకుండి) సంధ్యాసమయమైనది. నీవుగూడ మందిరమున కేగుము.

సంధ్యా—ఆజ్ఞననుసరించెద.

(అందఱును నిష్క్రమింతురు)

ఇది తృతీయాంకము.



దానబలి.

చతుర్థాంకము.

రంగము:—(వనమునందు-వామనుఁడు-గాలవుఁడు, జాబాలియు ప్రవేశించుచున్నారు.)

వామ—(గాలవునిఁ జూచి) గాలవా! నీవు పరమభాగవతోత్తముఁడవు కాగలవు. నీచిత్తమతి నిర్మలమైనదని నేను గ్రహించితిని.

గాల—గురుపుత్రా! నాకుముక్తిమార్గముఁ జూపింపుము. సమస్త జ్ఞానపరిపూర్ణుఁడవగు నిన్నాశ్రయించి నందులకు నన్నుఁ గృతార్థునిఁ జేయుము.

జాబా—నన్నుఁ గూడఁ గృతార్థునిఁ జేయవలయును. చదువురాని వాఁడను.

వామ—గాలవా! నీయభీష్టము స్తవనీయమైనది. బ్రహ్మరుద్ర మహేంద్రాది ప్రముఖు లేమహాత్ముని దివ్యపాదకమలముల సేవించి కృతార్థులగుచుందురో, యట్టి శ్రీమన్నారాయణుని నాశ్రయింపుము. ఆపరమాత్ముఁడే నిన్నను గ్రహింపఁగలఁడు. పంచేంద్రియంబులను బంధించి, చిత్తవికారమును బెకలించి,

కామరోషాదులను గాలించి, నిరంతరానంద భరితమానసుఁ
డవై శ్రీహరినాశ్రయింపుము. ఆ శ్రీమన్నారాయణుఁడే సర్వ
లోక కారణుఁడు. సమస్తము నారాయణార్పణముగ జేయుచుఁ
జిదానందుఁడవై నిత్యము నాతనిని సేవింపుము.

గాల—నీవింకను నన్ను మాయలోఁ బడవైచుచుంటివేమి ? నీవుగాక
మఱియొక శ్రీమన్నారాయణుఁడెవ్వరు ? నీవే సమస్త సృష్టి
స్థితిలయ కారణుండవు. సత్యాకారుఁడవైన నీయాజ్ఞశిరంబులఁ
దాల్చి బ్రహ్మరుద్రాదులు వర్తించుచుందురు. దేహాద్యభి
మానంబున సంసారసాగరమునఁబడి దరిగానక యున్నవాఁడ.

జాబా—(గాలవునిఁజూచి) నీకిప్పుడు సంసారబాధ యేమున్నదిరా !
భార్య వచ్చినప్పుడు నీవట్లు పలుకవచ్చును. (వామనునిజూచి)
నేను పెక్కుసంవత్సరములనుండి మీతండ్రిగారి దగ్గిఱ విద్య
నభ్యసించుచున్నాను. గాలవుఁడు సంపూర్ణ పండితుఁడైనాడు.
మందమతి నగునాకు ఒకశాస్త్రముగూడ పట్టుబడలేదు. ఈ
గాలవునకుఁ జూపుమార్గము నాకుఁగూడఁ జూపుము. కాని
యొక్కవిషయము మాత్రము జెప్పవలసియున్నది. నేను పెండ్లి
జేసికొనిన పిదప నీవు చెప్పుమార్గమునఁ జరింపవచ్చునా! పెళ్ళి
జేసికొనకుండ నయినచోఁ గొంచెము చిక్కు తటస్థించును.

గాల—మిత్రమా ! నీవాక్షేపికకుఁ గొంచెము సేపు బీగము వేయుము.

జాబా—వామనునితో నా సంగతిఁజెప్పుకొన నక్కఱలేదా !

వామ—మిత్రులారా ? మీయిరువురును గూడ నామాటలువినుఁడు.

జాబా—ఇప్పుడు నాకానందముగనున్నది. నేను వాగినదంతయునింక
నిరుత్తమే !

వామ—మిత్రులారా! ఈ షణత్రియమును వర్జించి, మోదఖేదములు సమముగాఁ జూచుచు, జగమంతయు నాత్మాధిష్ఠితముగా నెఱింగి మాయాదు లాత్మ తత్వాధీనములుగాఁ దెలియుచు జ్ఞానయుక్తుండవై విశ్వంబెల్ల శ్రీహరిగా భావించి మెలంగుఁడు. జన్మస్థానమేది? జననిజనక సోదరసతీసుతులు నిత్యులుగారు. సంపదలు చంచలములు. తనువు బుద్బుదప్రాయము. లోకమంతయు హరిమాయగా నెఱుంగుడు. (జాబాలితో) జాబాలీ!

మ. వనవాసిత్వము ముక్తిహేతువు గృహా • వాసంబు సంసారబం
ధనమంచున్ వచియించుమాటపరమా • ర్థంబంచు నూహింపఁగాఁ
జనునే దేనికినైన హేతువుగనన్ • స్వాంతంబెయౌ గాన, నా
మనమే బంధముముక్తియుంగొలుపునమ్మా! దీని శోధింపుమా.

గృహమును విడిచి భీకరారణ్యమున కరిగినయంతనే క్రోధముడుగదు. వనమునందుఁ గందమూలములు భుజించినయంతనే లోభముపోదు. వనవాసి యైనంతమాత్రమున మానవుఁడు ముక్తిఁబడయఁజాలఁడు. చిత్తము నిలుపుకొనలేనిఁ వాఁ డెచ్చటనున్నను నొక్కటే. చిత్తశుద్ధికలిగినవాఁ డెచ్చటనున్నను శ్రీహరిని భజించి, మోక్షము బడయఁగలఁడు. మీరీ రహస్యముల మనంబులందుంచుకొని శ్రీహరిని భజించి యభీష్టముల వడయుఁడు.

జాబా—అబ్బో! ఇది యింతయు మిగుల కష్టమే. అనాయాసముగా ముందు కావలసినంత భాగ్యము- తరువాత ముక్తియు లభించు మార్గమున్నచో బాగుండును. నేను బొందితోఁ గైలాసమునకుఁ బోవుట కేదయిన దారి యున్నదా! అనఁగా నిష్టము వచ్చినప్పుడు కైలాసమునందుండవలెను భూలోకమునకు రాడల·

చినప్పుడు వచ్చుచుండవలెను. ఇంతయేల ! నాకును, నీకు ముందు పెండ్లిగానున్న నా భార్యకును, నాకుఁ గలుగఁ సంతానమునకును జావులేని విధము చూడవలెను.

గాల—(నవ్వుచు) ఏమిరా నీకోరిక ! నీయాలు బిడ్డలకు, నీకును జూచు కొంటివిగాని నీతల్లి దండ్రులను గూర్చి యాలోచించలేదేమి !

జాబా—నాతల్లి దండ్రులు వృద్ధులైనారు. ఇఁక నేను వారినిగూర్చి శ్రమ తీసికొన నక్కఱవేదు.

గాల—మాతృపితృభక్తిలో నిన్ను జెప్పి మఱియొకరినిఁ జెప్పవలెను.

వామ—(నవ్వుచు) జాబాలీ నీకు మాటలయందున్న తెలివి విద్యయందు లేదేమి కారణమో !

జాబా— నిఘంటువులను గ్రంథకారులు నానోటినుండి వెలువడు మాటలనుబట్టియే వ్రాసినారు.-

వామ—మిత్రులారా! మనము వచ్చి చాలసేపైనది. అదిగో చూడుఁడు. సూర్యుఁడుగూడ నస్తమించినాఁడు. నేడు పౌర్ణమి యగుటచే చంద్రోదయముగూడ నైనది.

సీ. ప్రాచీదిశాంగనా ♦ ఫాలతలంబున
దీపించు సింధూర ♦ తిలకమనఁగ
దర్పించి విరహుల ♦ ధైర్యవల్లులఁద్రెంప
దర్పకుండెత్తిన ♦ దాత్రమనఁగ
వలిగి కాలకిరాతు ♦ డంధకారమృగంబు
ఖండింప మెఱయించు ♦ ఖడ్గమనఁగ
గగనతమాలవృ♦క్షముతూర్పు కొమ్మను
లలితమై మెఱయు ప♦ల్లవమనంగఁ

ఆ. దొగలు సంతసిల్ల ♦ దొంగలుభీతిల్ల
కడలి మిన్నుముట్టి ♦ కడలుకొనఁగ
బొడిచె శీతకరుఁడు ♦ భూరిచకోరక
ప్రీతికరుఁడు జార ♦ భీతికరుఁడు.

ఇఁక మనము ఆశ్రమమునకుఁ బోవుదము రండు.

(అందఱును నడచుచున్నారు.)

(రామశాస్త్రి - సోమయాజి - యను నిరువురు బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు.)

రామ—సోమయాజులూ! కనుచూపుమేరలో మన కేదియో యొక గ్రామము కనఁబడుచున్నది. ఈ రాత్రికక్కడ విశ్రమించి, తెల్లవారఝామున లేచి ప్రయాణము సాగింతము.

సోమ—కానీ! త్వరగా నడువుము. చంద్రుఁడుగూడ నుదయించినాడు.

వామ—(గాలవునిఁ జూచి) గాలవా! ఈభూసురులెక్కడికి బోవుచుండిరో యరయుము.

గాల—(బ్రాహ్మణులను జూచి) బ్రాహ్మణోత్తములారా! మీ రెక్కడికిఁ బోవుచున్నారు.

రామ—చాలదూరము పోవలసియున్నది.

జాబా—చెప్పఁగూడదా యేమి!

సోమ—నాయనా! ఇందు రహస్యమేమియున్నది. బలిచక్రవర్తి నర్మదాతీరమున నొక గొప్ప యాగము సేయుచున్నాఁడు. బ్రాహ్మణులము కదా పోవుచున్నాము.

జాబా—అయ్యా! మీ పేరేమి?

సోమ—సోమయాజులు.

జాబా—తమరు యజ్ఞముఁ జేసినారా యేమి?

సోమ—లేదు.

జాబా—తల్లిదండ్రులు పెట్టిన ముద్దుపేరేనా! శాస్త్రము లేనయిన ఘూర్తిగఁ జదివినారా!

సోమ—కొంచెము.

జాబా—నావలె గోశాకార మేనా!

వామ—జాబాలీ! ఈ యనవసర ప్రశ్నలెందులకు? మహనీయులతో హాస్య సంభాషణమా. (బ్రాహ్మణులను జూచి) బ్రాహ్మణోత్తములారా? ఈతఁడు హాస్యరసప్రియుఁడు. ఈతని మాటలను మీరు లెక్కగొనవలదు. (ఇంచుక యూరకుండి) మహాత్ములారా! మీర నేక దేశంబులఁ జూచియుందురు.

కం. వత్తురె విప్రులు వేడఁగ
నిత్తురె దాతలును వేడ్క ♦ నిష్టార్థములం
దెత్తురె మీరును సంపద
లిత్తెఱఁగున దానవీరుఁ ♦ డెవ్వఁడొ సెప్పుఁడా.

సోమ—(తనలో) ఈవామనుఁడెవ్వఁడో కాని యద్వితీయ తేజముతో విరాజిల్లుచున్నాఁడు (ప్రకాశముగా)

మ. కలరే దాతలు నిత్తురున్ ధనములుం ♦ గామ్యార్థముల్ గొంచు వి
ప్రులు నేతెంతురుగాని యీవిని బలిం ♦ బోలన్ వదాన్యుండు లేఁ
డలఘుండై యొనరించె నధ్వరశతం ♦ బాభార్గవానుజ్ఞచే
బలివేడం బడయంగవచ్చు బహుసం ♦ పల్లాభముల్ వామనా.

జాబా—నే నాబలిదగ్గిఱకుఁబోయి యాచించినచో నాపెండ్లి కేమయిన ధనమిచ్చునేమో!

వామ—(బ్రాహ్మణులను జూచి) బ్రాహ్మణోత్తములారా! ఇప్పుడు మీ రెచ్చటికిఁ బోవుదురు. ఈరాత్రి మా యాశ్రమంబున మాయాతిథ్యం బంగీకరింపుఁడు.

రామ—ఇంతకంటె మాకుఁ గావలసిన దేమున్నది.

వామ—పోవుదము రండు.

(అందఱును నిష్క్రమింతురు.)

రంగము:—(కశ్యపాశ్రమము;—ప్రవేశము - కశ్యపుఁడు - అదితి వామనుఁడు.)

కశ్య—(వామనునిఁ జూచి) నాయనా! వామనా!

క. ఏనిన్ను నఖిలదర్శను
   జ్ఞానానందస్వరూపు ♦ సంతతు నపరా
   ధీనుని మాయాదూరుని
   సూనునిఁగాఁగంటి నిట్టి ♦ చోద్యము గలదే.

ఉ. విశ్వము లీలఁద్రిప్పుచు న♦విద్యకుఁ జిక్కను వైననీకుఁ దా
   శాశ్వతమైన కాలమిది ♦ సర్వము వేడ బనుందుకట్టి వి
   శ్వేశ్వర మేలుకుప్ప నిను ♦ నెవ్వఁడు గోరి భజించువాఁడ పో
   శాశ్వత లక్ష్మిమృత్యుజయ♦ సౌఖ్యయుతుం డగు యుండు మాధవా.

అదితి—

ఆ. విలయకాలమందు ♦ విశ్వంబునీపెద్ద
   కడుపులోన డాచు ♦ కడిమి మేటి
   నటుఁడవీవు నేఁడు ♦ నాగర్భజుఁడవౌట
   పరమపురుష వేడ ♦ బంబుగాదె.

వామ—(అదితింగాంచి) తల్లీ! పూర్వము స్వాయంభువ మన్వంతరంబున నీవు పృశ్ని యనుపేరఁ బరఁగిన సాధ్వీమణివి. ఈతఁడు సుతపుండను ప్రజాపతి. పుణ్యదంపతులగు మీరాయిరువురు నాకై పరమనిష్ఠాగరిష్ఠులై తపంబొనర్ప, నేను ప్రసన్నుఁ

డనై మీ కేమి వరంబులు గావలయునని యడిగితిని. సంతాన
వములేని మీరు నన్నే నాయట్టి కొడుకు నొసంగుమని కోర
నట్లొసంగి, మీకుఁ బృశ్నిగర్భుండను నందనుఁడనైతిని.

క. అదితియుఁ గశ్యపుఁడనఁగా
విదితులరగు మీకుఁ గుఱుచ ♦ వేషంబుననే
నుదయించితి వామనుఁడనఁ
ద్రిదశేంద్రానుజుఁడనై ద్వి ♦ తీయభవమునన్.

ఇఁక నొక భవంబున మీయందు నాకు జన్మమున్నది. తరు
వాత మీయందెప్పటికిని నాకు జన్మములేదు.

క. నందనుఁడనియుం బరమా
నందంబగు బ్రహ్మమనియు ♦ ననుఁ దలఁచుచు నా
పెందెరువు నొందెదరు నా
యందుల ప్రేమమున భవము ♦ సంహరుమీరల్.

అది — వత్సా! వామనా! జగత్కారణుండవగు నీకుఁ దెలియని విష
యంబులేవియును లేవు. కాని, నేనిందు నిమిత్తమాత్రను. నీయ
గ్రజుఁడగు మహేంద్రుఁడు దానవనాథుఁడగు బలికోడి, సమస్త
రాజ్యశ్రీః వీడి యాలుబిడ్డలతో సందందుఁ జరించుచున్నాఁడు.
బలి యమరావతిని బాలించుచున్నాఁడు. నీవిఁక నెట్లయిన బలి
సంపద హరించి శచీనాథుని మరల నమరలోక సామ్రాజ్య
సింహాసనాసీనుం జేసి, యమరుల నుద్ధరింపుము.

కశ్య — నాయనా! అమరలోకసంరక్షణ మవశ్యమాచరణీయము. జగ
న్నాటక సూత్రధారివగు నీవు మాపూర్వపుణ్యవశమున దన
యుఁడవైతివి. అట్టిచో నీకు నేనింతకన్న నేమియుఁ జెప్పఁ
జాలను.

వామ—తండ్రీ! నే నందులకొఱకే కదా మీకు సుతుండనైతిని.. ఆ విషయ మట్లుండనిండు. జననీజనకులయానతిఁ దీర్చుటకన్నఁ బుత్రునకు మఱియొక సుకృతమేమి యున్నది? తన జన్మమునకుఁ దండ్రియే మూలమని యెఱింగిన వివేకశాలియైన పుత్రుఁ డెవ్వఁడైనను, దండ్రియాజ్ఞ శిరంబునఁ దాల్పకయుండునా! తండ్రి పూజ్యుడు - దైవము గురుఁడు. సత్పుత్రుఁడగువాఁడు అవసరమైనచోఁ దనప్రాణములఁ బరిత్యజించియైనఁ దల్లిదండ్రులకుఁ బ్రియంబుఁ గూర్పవలయును. ఇట్టిదే పుత్రధర్మము. అట్టి పుత్రుండే జగంబున శాశ్వతకీర్తి నందును. (ఇంచుక యోచించుండి) నేను నేఁడే విబుధలోకసముద్ధరణకార్యోద్యోగినై బలిం జేరి, యాతని సంపదల హరించి, యమరలోకము మహేంద్రునకుఁ గూర్చి, మీకానందముఁ గూర్చెదను.

జాబాలి—(ప్రవేశించి) శ్రీమన్నారాయణ స్వరూపా! వామనా! నీ జననంబున నీజననీ జనకులు ధన్యులైరి. నీవంటి మహానీయుని యుద్భవించుటచేతనే యీ యార్యావర్తము పవిత్రమైనది. నీవు తలంచిన యమరలోకరాజ్యోద్ధారణము సత్వరముగనే జరుగుగాక! గంగాస్రవంతీ వీచికాపరంపరలయందుఁ బావనత్వ మెంతకాల మందునో, దివాకర సుధాకరు లెంతకాలముందురో, యంతవఱకు భవదీయకీర్తి యుండుఁగాక! భక్తులు నీపరమపవిత్రచరిత్రమును గానము చేయుదురుగాక!

కశ్య—ఓరీ! ఎక్కడఁ దిరుగుచుంటివి? ఇప్పుడువచ్చితివి?

జాబా—స్వామీ! గాలవుని సమిత్కుశఫలాహరణార్థము పంపినాను.

కశ్య—నీసంగతి నే నడుగుచుంటిని.

జా బా—నేనును గాలవునితో మొదట బయలుదేరితిని. కాని కొంత దూరము పోయి వెనుకకు వచ్చితిని. వచ్చుచుండఁగా దారికడ్డ ముగా నొకసర్పము పడియున్నది. దానింజూచి భయమంది ముందున కడుగు వేయలేక నెమ్మదిగా నక్కడనున్న వృక్ష మెక్కి, ఆసర్పము పోయినతరువాత నేగవచ్చునని కూర్చుం టిని. ఆసర్ప మెంత సేపటికిని పోదు. అది సర్పమా కాదా యని చెట్టుపైనుండి తదేకదృష్టితోఁ జూడఁగా, తుదకు త్రాడని తోచినది. కాని, బాగుగా గ్రహించలేక పోవుటచే చెట్టు దిగివచ్చుటకు భయముగానే యుండెను. ఇంతలో భగవం తుని దయవలన నామార్గమునఁ దన కేదారమునకుఁ బోవు కాపువాడొకఁడు వచ్చెను. దారిలో నున్నది పామని చెప్పి నచో నది త్రాడేమో! అట్లయిన; బ్రాహ్మణుఁడు భయమందిన వాడని వాఁడు తలంచును. అందుల కుపాయ మాలోచించి, యాతనిని జూచి, క్రిందబడియున్న త్రాడు నాకందీయుము ఆకులను కట్టుకొనవలయునని పలికితిని. పామని నేను తలంచిన త్రాడు నాతఁడు నాకుఁ జెట్టుపై కెగర వేసెను. అంతట నేను నాయవివేకమునకు నవ్వుకొనుచుఁ జెట్టు దిగి యిట్లు వచ్చితిని.

వాసు—మిత్రమా! ఈకథనొక పురాణముఁ జేసితివే!

జాబా—ఒకరికిఁ జెప్పు విషయము సవిస్తరముగా నుండవలయును (ఇంచుక యూరకుండి) ఈవిషయమున కేమిగాని, బలి యొద్ద కిప్పుడు పోవుదము

వాసు—నీవు గూడ వచ్చెదా యేమి?

జాబా—వప్పులేని పెండ్లి యుండునా? నీవెంట నేను గూడ వచ్చెదను.

(కశ్యపుని జూచి) మహాత్మా! ఇందులకుఁ దమ రనుజ్ఞనీయవలయును. ఆ మహోత్సవ సందర్భమున-మడత పూరీలును,పులిహోర మొదలగునవి చేయుచున్నారఁట. చాల రుచికరముగ నున్నవని విన్నాను. అవి తినవలెనని భ్రాంతి కలిగినది.

వామ—(నవ్వుచు) ఇందులకేనా నీవు నాతో వచ్చునది.

జాబా—తిన్నది జీర్ణమగువఱకు నీవేపని చెప్పినను జేయుదును.

కశ్య—వామనా! జాబాలిని నీవెంటఁ దోడ్కొనిపొమ్ము.

జాబా—ఆహాహా! నాభాగ్యము పండినది. (గంతులు వేయును)

వామ—(అదితి కశ్యపులను జూచి) నేటి వేకువఝామున బయలుదేరెదను.

కశ్య—మంచిది.

జాబా—వామనా! భోజనమునకు వేళ యైనది. స్నానమునకుఁ బోవుదము రమ్ము

వామ—పోవుదము.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది చతుర్థాంకము.



దానబలి.

పంచమాంకము

రంగము:—(బలియజ్ఞశాలముందు జాబాలి ప్రవేశించుచున్నాఁడు.)

జాబాలి—(తనలో) యాగమహోత్సవముఁ జూచుటకు నాకీ రెండుకన్నులును జాలకయున్నవి. ఒకచోట బ్రాహ్మణుల వేదఘోష. ఒక ప్రక్క శ్రీహరిసంకీర్తనము సేయు భక్తబృందము. ఒకదెసఁ దగుదుమని త్రైతక్కలాడు వేశ్యాంగనలు. బండ్ల గబగబలు- గుఱ్ఱముల సకిలింపులు- రథచక్రముల కిఱ్ఱుచప్పుడులు- మత్తగజ ఘీంకారములు- మంగళవాద్యములు- దానముల కొఱకు బ్రాహ్మణుల పరుగులు- మొదలగునవి చూడ నా చిత్తమున కపరిమితానందము కలుగుచున్నది. ఏ బ్రాహ్మణుని నోటినుండి వచ్చినను బలివంటి వదాన్యుఁడు లేడను మాటయే. (ఇంచుక యూరకుండి) యాగవైభవమున కేమిగాని, ఆహా ? ఏమి భోజనసదుపాయము ! ఇట్టి భక్ష్యములుగాని, కూరలుగాని నే నెప్పుడును తినియుండలేదు. ఈ బలి బ్రదికియున్నంతవఱకు నిట్లేయజ్ఞములుచేయుచున్న చో బాగుండును. పెండ్లియైన తరువాత నా భార్యతోఁ గూడ నిక్కడనే యుండును.

(రామశాస్త్రి, సోమయాజులు ప్రవేశించుచున్నారు.)

జాబా.—(బ్రాహ్మణులను జూచి) రాత్రి మళ్ళీ మీరు కనిపించనే లేదు. భోజనమైన తరువాత మీకొఱకు వెదకితిని.

సోమ—మాయందు కొంచెము అభిమానముంచినావు.

జాబా—సరి సరి యెంతమాట. ఇట్టి సమయములలో మనము కలసి మెలసి యుండవలెను.

జాబా—(రామశాస్త్రినిఁజూచి) మొన్న మనకాశ్రమంబున నాతిథ్యమొసంగిన వామనుఁడుగూడ వచ్చినాడు. నీవుచూచితివా!

రామ—చూచితిని. (ఇంచుకయూరకుండి) ఈ యాగమునకు గొప్ప యేర్పాటులు చేయఁబడినవిసుమా! అనేకమంది రాజులు యాగములు సేయఁగా మనము చూచియుంటిమి గాని యింత వైభవముగా జరిగిన యాగమెచ్చటను జూడలేను.

జాబా—ఈ యాగములో నిన్న చేసిన పిండివంటకయినంత స్వాద్వన్న మీరుచూచిన యాగములకైయుండదని నేను చెప్పఁగలను! రాత్రి తిన్నపదార్థములరుచి, యింతవఱకును జిహ్వను వదలలేదు. (ఇంచుకయూరకుండి) సోమయాజులుగారూ! నేను చెప్పినానని మీరు మఱియొకవిధముగాఁ దలఁపవలదు. మీరు వెళ్ళునప్పుడు నెమ్మదిగా కొన్ని భక్ష్యములు యింటికిఁ దీసికొని వెళ్ళుఁడు. పిల్లలు తిందురు

సోమ—జాబాలీ! నీ వన్నియు నవ్వువచ్చు మాటలేకదా!

రామ—(జాబాలినిజూచి) నిన్న నడుగుటకు మఱచితిని. మీవామనుఁడు శాస్త్రాభ్యాసము పూర్తిగఁజేసెనా!

జాబా—శాస్త్రిగారూ! మీరువామనుని సంగతి నడుగుచున్నారా. ఆతనికొక విద్యవచ్చును. ఒకటిరాదు, అని చెప్పుటకు వీలులేదు

అతనికుక్షి సమస్తవిద్యలతో నిండియున్నది. చిన్నసభలో మీరు చూడలేదా యేమి! సింహమువలె, పులివలె, లేడివలెఁ జరించినాఁడు. మా వామనుని రాకఁ జూచిన యంతనే సభ యంతయు నదిరొకవిధమునఁ గన్పట్టెను. అతఁడు సభాప్రవేశము సేయునప్పుడు,

శా. శంభుండో హరియో పయోజభవుఁడో • చండాంశుఁడో వహ్నియో
దంభాకారతవచ్చెఁగాక ధరణిన్ • ధాత్రీసురుండెవ్వఁడీ
శుంభద్యోతనుఁ డీమనోజ్ఞతనుఁ డం • చున్ విస్మయభ్రాంతులై
సంభాషించిరి బ్రహ్మచారిఁగని • తత్సభ్యుల్ రహస్యంబుగన్.

క. గుజగుజలు వోవు వారును
గజిబిజిఁబడువారు జాల • గలకలపడుచున్
గజిబిజియయ్యెరి సభాస్థలిఁ
బ్రిజలెల్లను బొట్టివడుగు • పావనిరాకన్.

అతఁడు సభాప్రవేశముఁ జేసి లింగము మ్రింగిన పూజారివలె నున్నాఁడనుకొన్నారా యేమి? సభయందున్న మహనీయులయొద్ద నే విధమైన విద్యాశక్తి యెంతయున్నదో గ్రహించుచుఁ జరించినాఁడు.

సీ. చవులుగాఁ జెవులకు • సామగానంబులు
సదువు నుద్గాతల • చదువువినుచు
మంత్రితంత్రార్థ సం • బంధభావములు, పే
ర్కొను యాయజూకులఁ • గూడికొనుచు
హోమకుండంబులం • దున్న త్రేతాగ్నుల
వెలిగించు యాజక • వితతిఁ గనుచు
రత్నులై బహువిధా • ధ్వర విధానంబులు
సెప్పెడు సభ్యులఁ • జేరఁ జనుచుఁ

తే. బెట్టుగోరెడు వేడుక • పట్టుపఱుప
నదితి పుట్టువు లచ్చికి • నాటపట్టు
గోరి చరియించె సభలోనఁ • గొంతఁ దడవు
పుట్టు వెన్నుఁడు నెఱుఁగని • పొట్టివడుగు.

సోమ—మహాపురుషుఁడని యాతని తేజమే తెలుపుచున్నది. ఆతఁ
డింకను బలిం జూడలేదా యేమి ?

జాబా—బలియును శుక్రాచార్యులును నాతని నింకను జూడలేదు.

రామ—వదాన్యుఁడగు బలి వామనుని నెక్కువగ సత్కరించును.

జాబా—ఇంకను మీరీ సంభాషణము పెట్టుకొని యాలస్యము సేయు
చున్నారేమి ? వచ్చిన కార్యమున కుపక్రమింపక,

సోమ—ఏమి కార్యమున్నది ?

జాబా—మీరు వచ్చిన దెందులకు ? భోజనముచేసి పోవుటకా !
ఏదో కొంచెము ఇంటికిఁ బోవునప్పుడు చెంగున ముడివేసికొన
వలదా ! సోమయాజులుగారూ ! మీ వేషమేమీ బాగు
లేదు. ఒక శాలువ తలకుఁజుట్టి, యొకటి పైన వేసికొనుఁడు.
లోపలనుండు విద్య యెట్లున్నను, పైవేషము డాంబికముగ
నుండవలయును సభలలో విద్యావంతులకన్న నిప్పుడిట్టివారే
గొప్ప సత్కారములను పొందుచున్నారు. మనది వైదికవృత్తి
యైనను కొంచెము నియోగము కృత్రిమము చేయవలయును.
(రామశాస్త్రిని జూచి) మీ వేషము బాగుగనే యున్నది.

వామ—(ప్రవేశించి జాబాలినిఁ జూచి) ఇక్కడనే యుంటివేమి? (ఆక
సమువంకఁ జూచుచు) అటు జూడుము.

సీ. పౌలోమి తనబాలు • పాన్పుపైఁ గనుపట్టఁ
బన్నిన పవడంపు • బంతియనఁగ
నాయురర్థముల వ్య • యంబులో త్తెలి చాటు
కాలజాంఘికు చేతి • ఘంటయనఁగ
ఘనజంతు జీవిత • కాలరాసులవిధి
కొలువనొత్తిన హేమ • కుంభమనఁగ
బర్హిముదిక్కాంత • పరఁగఁ గైసేయుచో
ముందట నిడుకొన్న • ముకురమనఁగ

తే. గోపతాపోప శమదివ్య • ఘుటికయనఁగ
బద్మినీకాంత నోముల • ఫలమనంగ
మూఁడుమూర్తుల సారంపు • ముద్దయనఁగ
మిహిర మండల ముదయాద్రి • మీఁదనొప్పె

ఇఁక మనము యజ్ఞవాటికఁ బ్రవేశింపవలయును. (బ్రాహ్మణోత్తములు మొదలగువారందఱును పోవుచున్నారు.

జాబా—నీయాలస్యమేగాని నాయాలస్య మేమియును లేదు. ఎప్పు డా బలిమెదుటఁ బడి, యాతఁడిచ్చుదక్షిణ మూటఁగట్టుకొందునా యని వేచియున్నాను. (బ్రాహ్మణులను జూచి సోమయాజులు గారూ! రామశాస్త్రిగారూ! రండు. త్వరగాఁ బోవుదము. (బ్రాహ్మణులును - జాబాలియు నిష్క్రమింతురు.)

వామ—(తనలో) ఆహా! బలివైభవము వర్ణనాతీతము కదా! మహేంద్రునకైనను నట్టి వైభవము లేదు. ఈబలి త్రిభువనములకు నధీశుఁడై యుండుటయే గాక, చతుర్దశభువనాధిపత్యమునకైనను నర్హుఁడనుట కావంతయు సందియము లేదు. ఈతనియందున్న

వదాన్యతయు, సత్యసంధతయు మున్నెవ్వరి యందును వినంబడవు. ఇట్టి సకలసద్గుణ విరాజితుని, నిరంతర దేవతాబ్రాహ్మణపూజారతుని నెట్లు వంచించి, అతని రాజ్యశ్రీల నమరేంద్రునకుఁ గూర్తును; అతనియం దేమి దోషముపొడగట్టుచున్నది. (ఆలోచించి) అమరేంద్రుని రాజ్యము హరించుటయేకదా! బలవంతులయినవారు నిజ భుజబలశౌర్యంబులఁ బ్రకటింపఁ బరరాజులను జయించి, వారి రాజ్యంబులఁ గొనట వీరచూడామణుల కాచారమని ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడియున్నది. అట్టిచో నతనియందు ధర్మవిరుద్ధ మేమియున్నది! (ఆలోచించి) అకారణముగ నమరేంద్రుని రాజ్యము హరించి యాతనిని వెడలనడుపుటయే కారణముగాఁ గొనవలయును. (ఇంచుక యూరకుండి) ఇదియు నంత సమంజసముగా లేదు. అతనిని వంచించుటకు నాచిత్తము సమ్మతింపకయున్నది. (ఆలోచించి) ఏమిచేయుదును! నేనూరక యుంటినేని దేవేంద్రుఁడు కానన సీమఁ బరిపాలింప వలసినవాఁడే! ఇది యట్లుండ నేనవతరించినది యమరలోకము నుద్ధరించుట కేకదా! ఇఁక యోచింపనేల - (ఇంచుక యూరకుండి) బలికి మఱియొక విధమున రాజ్యశ్రీలఁ గూర్చెదఁగాక!

(నిష్క్రమించును)

రంగము—(యాగశాల—బలిచక్రవర్తియు-శంబరుఁడు శుక్రాచార్యులు నుందురు-జాబాలి-రామశాస్త్రి-సోమయాజులు మొదలగు బ్రాహ్మణులుందురు.)

బలి—(శుక్రాచార్యులఁ జూచి) ఆచార్య! నీయమూల్య కరుణా విశేషమున నిట్టి మహాయాగము సేయుచున్నాఁడ - (ఇంచుక

యూరకుండి) మహాత్మా ! ఎవ్వరికిని ఏవిధమయిన కొఱంతయు గలుగకుండ యాగము యథావిధిగ జరుగుచున్నదికదా ! భోజన దక్షిణ విషయంబులందు భూసురోత్తములు సంతృప్తిఁ బొందుచుండిరి కదా !

శుక్రా—దానవేంద్రా ! ఏవిధమయిన లోపము లేదు-ఇట్టి దానములు మున్నెవ్వరును నిచ్చియుండ లేదనియు, నిట్టి యజ్ఞము పూర్వ మెవ్వరిచేతను చేయఁబడ లేదనియుఁ జెప్పుకొని బ్రాహ్మణులు సంతోషించు చున్నారు.

రామశాస్త్రి—(సభలోనుండి లేచి శుక్రాచార్యుని సమీపించి) అయ్యా ! శుక్రాచార్యుల వారూ ! మీరు ఆస్థానపురోహితులు గావున మాయందుఁ బరిపూర్ణ దయనుంచ వలెను.

సోమయాజులు—అందఱివలె మమ్ముఁ జూడవలదు. నాలుగు వేదములను దలక్రిందులుగాఁ జదువఁగలను.

జాబాలి—(రహస్యముగా సోమయాజులతో) అందఱివలె నాలుగు వేదములను చదువఁ గలనందువేమి ! ఇందులో నీ గొప్పయే మున్నది ? అయిదు వేదములని చెప్పుము. ఐదవదానికి నేనే గ్రంథకర్తనుము. సంశయింపకుము.

రామ—నేను వివాహములు మొదలయిన శుభకార్యములు ముందు వెనుకలు చూడకుండఁ జేయింపఁగలను.

జాబా—(రామశాస్త్రితో) అపరకర్మల సంగతి మఱచిపోయినావు. (తనలో) ఈ యిద్దఱికిని డొక్క-చీరినను అక్షరము కనఁబడదు. నాకు పెద్దన్నయ్యలే. (ప్రకాశముగా శుక్రాచార్యునితో) మీకు సంశయమున్నచో విద్య పరీక్ష చేసినపిదప బహుమతి నిప్పింపుఁడు.

సోమ—(తనలో) ఈ జాబాలిముండాకొడుకు అసాధ్యుఁడు. అనవసర సంభాషణము అధికము. ఈతని మాటలు విని శుక్రాచార్యుఁడు నన్ను వేదములో నే పనసనైనఁ జెప్పుమన్నచో నేమి చెప్ప గలను ? గ్రుడ్లు రెండును నప్పగించి నిలువవలసినదే.

జాబా—సోమయాజులుగారూ ! చూచెదరేమి ! సామవేదములో రెండు పనసలు కానియ్యండి.

రామ—(తనలో) మాకు వీఁడెక్కడ దాపరించినాఁడు (ప్రకాశముగా జాబాలిని జూచి) మేమేదో శుక్రాచార్యులవారితో మాసంగతి చెప్పుకొనుచుండఁగా మధ్య నీ వనవసరముగ మాటలాడెదవేల ?

జాబా— అసందర్భపు మాట యేమియును నేను మాట్లాడలేదు. (శుక్రాచార్యునిఁజూచి) అయ్యా ! నేనుగూడ గొప్ప పండితుఁడనే. పేదవాఁడనగుటచే కొలువ వేసికొనలేక యూరకున్నాను. చక్రవర్తితోఁ జెప్పి, తమరిప్పించినచో వేసికొందును. వేదములు తలక్రిందుగాఁ జదువలేనుగాని, నిలబెట్టి చదువఁగలను. తర్కవాదములో కర్కశవాదము. కాదన్న అవునందును. అవునన్న కాదందును. వ్యాకరణ శాస్త్రములోఁ జెప్పనక్కఱలేదు. సూత్రములుతప్పఁ దక్కినదంతయు నున్నది. కవిత్వము:—అందులో ఆశుకవిత్వము:—నానోటినుండి వెలువడినమాటలెల్ల శ్లోకములేయని మీరు భావించవలెను. సాధారణముగా ఘంటకు రెండువందలు శ్లోకములు చెప్పగలను. పట్టుదల కలిగినచో సభలో నైదువందలవఱకు గంగాప్రవాహమువలెనే వెళ్లును. ఇంకను సమర్థతఁ జూడవలెనని యెవ్వరైన దలఁచినచో, నాలుకఁజాపి నిలిచియుందును. నోరుకదప సవసరములేదు. శ్లోకములు

నాభినుండి బయలువెడలి నాలుకపైఁబడి క్రిందకు దొర్లును. మీరుపరీక్ష సేయఁదలఁచినచోఁ జేయవచ్చును, సాధారణముగా శాస్త్రవాదములుకలిగినప్పుడు నాకొక యులవాటున్నది. నాతో వాదమునకు దిగినవారు నిలబడినచో నేను కలబడుదును. వారు కలబడినచో నేను నిలబడుదును.

శుక్రా—(నవ్వును)

ఒక బ్రాహ్మణుఁడు—(బలింజూచి) మహారాజా ! దూరదేశమునుండి వచ్చితిని. నాకుమారునకు వివాహముసేయ నిశ్చయించినాను. రిక్తహస్తుఁడను. ఈ కార్యము తమకటాక్షమువలన జరుగవలయును. వాఁడొక యింటివాఁడగును.

జాబా—(బ్రాహ్మణుని జూచి) అయ్యా ! అబ్బాయి యేమి చదువుకొన్నాఁడు.

బ్రాహ్మణుఁడు—చదువు కొంచెము తక్కువే.

జాబా—తమకు భూవసతి యేమైన నున్నదా !

బ్రాహ్మ—వసతి యున్నచో ఈ యాచన యేల ?

జాబా—యాచనజేసి అబ్బాయికి పెళ్లి చేయఁదలఁచినారా? బాగుగనే యున్నది. చదువు లేదు. సంపద లేదు. అమ్మాయి యింటికివచ్చి అబ్బాయిని అదితే ఇదితే యని యడిగినప్పుడు తెలియును. తగినంత శక్తి లేనప్పుడబ్బాయి మెడకు సంసారపు గుదిబండ తగిలించడ మెందులకు ?

బ్రాహ్మ—(తనలో) వీనికి యనవసరపు గొడవ యెందులకో.

బలి—(బ్రాహ్మణుల నందఱిని జూచి) బ్రాహ్మణోత్తములారా ! ఇటు రండు.

బ్రాహ్మ—(బలిని సమీపింతురు.)

బలి—మహాత్ములారా! ఈ స్వల్పదానంబుల గ్రహించి నన్నుఁ గృతార్థునిఁ జేయుఁడు. నే నెప్పుడును మీ కరుణకుఁ బాత్రుఁడ (బ్రాహ్మణు లందఱికిని దక్షిణల నిచ్చును.)

బ్రాహ్మణులు—బలిచక్రవర్తి యొక్క వైభవ మాచంద్రార్కతారా వనీ శరధి స్థాయిగనుండుఁ గాక!

వామనుఁడు—(ప్రవేశించి తనలో) ఇఁక నేను బలిం జేరెదఁగాక (కొంచెము నడచును)

జాబా—(తనలో) మా వామనుఁడు బలిని సమీపించుచున్నాఁడు. ఏమి దానమడుగునో!

రామ—(సోమయాజినిఁ జూచి) సోమయాజులూ! ఈ వామనుని దివ్య తేజము జూచి, శుక్రుడు గూడ విస్మయమందుచున్నాఁడు. ఈతఁడు కొంచెమైనను సంశయింపక బలిని సమీపించుచున్నాఁడు.

శుక్రా—(బలిం జూచి తనలో) "కరచరణాద్య వయవంబులు ధరించిన వేదరాశియును బోలె నిటు వచ్చుచున్న సదండచ్ఛత్రుండును, గళలంబిత భిక్షాపాత్రుఁడును, గరకలిత జలకమండలుండును, మనోహర వదన చంద్రమండలుఁడును" అగు నీవటుఁడెవ్వరో కదా? అమేయ తేజోవిలసితుఁడై యున్నాఁడు.

వామ—(బలిని సమీపించి)

మ. ఇతఁడే దానవచక్రవర్తి సురలో ♦ కేంద్రాగ్ని కాలాది ది
క్పతి గర్వాపనయ ప్రవర్తిగతలో ♦ భస్ఫూర్తి నానామఖ
వ్రత దానప్రవణానువర్తి సుమనో ♦ రామామనో భేదనో
ద్ధత చంద్రాత పకీర్తి సత్యకరుణా ♦ధర్మోల్లస న్మూర్తిదాన్.

ఉ॥ స్వస్తి జగత్త్రయీభువన ♦ శాసనకర్తకు హాసమాత్ర వి
ధ్వస్తనిలింపభర్తకు ను ♦ దారపదవ్యవహర్తకున్ మునీం
ద్రస్తుత మంగళాధ్వర వి ♦ ధాన విహర్తకు నిర్జరీగళ
న్యస్త సువర్ణసూత్ర పరి ♦ హర్తకు దానవలోక భర్తకున్.

బలి—(పీఠమునుండి లేచి వామనునిం గాంచి) భూసురోత్తమా ! పరమ పవిత్రమైన నీ పాదసరోజములకు నమస్కరించుచున్నాను. (వామనుని పాదములకు నమస్కరించి) మహాత్మా ! ఈ భద్రపీఠమున నాసీనుఁడవు గమ్మ.

వామ—(ఆసీనుఁడగును.)

బలి—(వామనునిఁ జూచి)

మ. వడుగా యెవ్వరివాఁడ వెవ్వఁడవు సం ♦ వాసస్థలం బెయ్యది
య్యెడకున్ నీవరుదెంచుటన్ సఫలమ ♦ య్యెన్ వంశమున్ జన్మమున్
గడు ధన్యాత్ముఁడనైతి నీముఖము యో ♦ గ్యంబయ్యె నా కోరికల్
గడతేఱెన్ సుహృతంబులయ్యె శిఖులుం ♦ గల్యాణమిక్కాలమున్.

మహాత్మా ! నేను నిరంతరమును విప్రపాదసరోజరేణువులను గిరీటంబున ధరింతును. బ్రాహ్మణసేవయే నా యభివృద్ధికిఁ గారణమని యెఱింగినవాఁడను. భూసుర పదరజంబు శిరంబునఁ దాల్చు సలఘులకు సర్వ పాపక్షయమును, సద్గుణవాప్తియుఁ గలుగును. (ఇంచుక యూరకుండి)

మ. వర చేలంబులొ మాడలో ఫలములో ♦ సస్యంబులో గోవులో
హారులో రత్నములో రథంబులొ విశి ♦ ష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో ♦ గ్రామంబులో భూములో
ధరణీఖండమొ గాక యేమడిగెదో ♦ ధాత్రీసురేంద్రోత్తమా.

సోమ—రామశాస్త్రీ ! చూచినావా ! వామనుని బలి యెట్లు గౌర
వించి యడుగుచున్నాఁడో !

బా. బా—సోమయాజులుగారూ ! మహాసభలలో నట్టివారు గాక
మనమా గౌరవింపఁబడువారము. వినుఁడు. వామనుఁ డేదో
బలికి బ్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు.

వామ—(తనలో) ఈతని యద్వితీయ బ్రాహ్మణభక్తి నెంతయు
మెచ్చవచ్చును. (ప్రకాశముగా బలింజూచి) ఓ దానవలోక
సార్వభౌమా !

సీ. ఇదినాకు నెలవని ♦ యేరీతిఁబలుకుదు
నొకచోటనకయెందు ♦ నుండనేర్తు
నెవ్వనివాఁడ నం ♦ చేమని నుడువుదు
నాయంతవాఁడనై ♦ నడవనేర్తు
నీ నడవడియని ♦ యెట్లు వక్కాణింతు
బూని ముప్పోకలఁ ♦ బోవనేర్తు
నదినేర్తు నిదినేర్తు ♦ ననియేల చెప్పంగ
నేరుపులన్నియు ♦ నేననేర్తు

ఆ. నొరులుగారునాకు ♦ నొరులకునేనాదు
నొంటివాఁడఁజుట్ట ♦ మొకఁడు లేడు
సిరియుఁ దొల్లి గలదు ♦ చెప్పెద నాకింక
సుజనులందుఁ దఱచు ♦ సొచ్చియుందు.

ఆసంగతి యట్లుండనిమ్ము. వదాన్యులలోఁ బ్రసిద్ధుఁడవగు నీవ
నినమాట కీర్తిదంబును, గౌలార్హంబును, ధర్మయుతంబునై యున్నది.
నీ వంశము వారందఱును గరుణానువర్తనులు. సత్త్వమూర్తులు. రణము

నందుఁగాని వితరణమునందుఁగాని వెనుకంజవేయువారులేరు. మీ తాతలందఱును మహాకీర్తిఁగాంచినవారు. అందుఁ బ్రహ్లాదుని కీర్తి యిట్టిదని వర్ణింపజాలను. అతని పినతండ్రియగుహిరణ్యాక్షుండు సమస్తలోకముల జయించితనకుఁబ్రతివీరునిఁగానక చరించుచుండ, శ్రీహరి వరాహరూపంబున నాతనిని వధించెను. ఆతని యగ్రజుఁడగు హిరణ్యకశిపుని పరాక్రమాదులత్యద్భుతములు శ్రీమన్నారాయణుఁ డాతని కొఱకు నరహరి రూపమెత్తవలసి వచ్చెను. భూసుర వేషమునఁ బురుహూతాదులు వచ్చి వేడఁగా, నీతండ్రి తన ప్రాణముల నొసంగి, చతుర్దశ భువన విఖ్యాతి నందినాఁడు. నీవా! బలపరాక్రమ శౌర్యంబులయందు నీ పితామహుల మించి, యింద్రునిఁ దోలి మూఁడు లోకములముల నేలుచుంటివి.

బలి—దేవా! నీవు నన్నింతగా స్తుతింపవలదు. నేను నీ యాశీర్వచనమునకును, జయమునకును బాత్రుఁడ. నాయందుఁ బరిపూర్ణ కృపఁ జూచి నీకేమి కావలయునో కోరుము. నీయభీష్టముఁ దీర్చి నేను కృతార్థుఁడ నగుదును.

వామ—రజనీచరకులేంద్రా! రాజ్య సంపదలు గలిగినవాఁడు తన సంపదను గొంతవఱకు బూజ్యులకును, భూసురులకును, యాచకులకును వినియోగపఱచఁడేని, వాని జన్మవ్యర్థము. త్రిభువనాధిపత్యము వహించిన నీవు వదాన్యులలో శ్రేష్ఠుఁడవను కీర్తి జగంబులందు వ్యాపించియున్నది. నేనెన్నఁడును నిన్నేదియుఁ గోరియుండలేదు. నాకు యాచనకిదియే ప్రారంభము.

బలి—మహాత్మా! ఈ వాక్యంబులన్నియు నేల? నీకోరిక సత్వరంబుగఁ దెలిపిన నేనెంతయు సంతసింతును.

వామ—నిర్జరారీ! నీకు నాయందున్న భక్తిచే నే యభీష్టమునైనను గోరుకొనుమని చెప్పితివికదా యని నేను సంతసించి, నాకది కావలె - నిది కావలెనని కోరువాఁడఁగాను.

ఆ. వె ఒంటివాఁడ నాకు ♦ నొకటి రెండడుగుల
మేరయిమ్ము సొమ్ము ♦ మేరయొల్ల
గోర్కిదీర బ్రహ్మ ♦ కూకటి ముట్టెద
దానకుతుక సాంద్ర ♦ దానవేంద్ర.

శుక్రా—(తనలో) ఈ మాణవకుని కోరిక కడు మాయగ నున్నది.

బలి—(నవ్వుచు వామనునిఁ జూచి) భూసురా! ఎంత స్వల్పపు దానమడిగితివి. మనంబుననున్న యభీష్టము తెలిపినచో నే నేమైన మఱియొక విధమున భావింతు నేమోయని సంశయించితివా! కాకున్న నిట్లు కోరుటయేమి? దాతయొక్క వైభవమునైన నీవు తలంపవలదా! యాచన మార్గము నీకుఁ దెలియనట్లున్నది.

మ. వసుధాఖండము వేడితో గజములన్ ♦ వాంఛించితో వాజులన్
వెసనూహించితొ కోరితో యువతులన్ ♦ వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేరవున్నడుగ నీ ♦ భాగ్యంబులీపాటి గా
కసురేంద్రుండు పదత్రయంబడుగ నీ ♦ యల్పంబు నీనేర్చునే.

జాబా—(తనలో) "ఉట్టినెక్కలేనివాఁడు స్వర్గమున కెక్కునా?"

వామ—(బలిం గాంచి) వైరోచనా! నీవు భుజబలపరాక్రమమునఁ ద్రిభువనంబులఁ బాలించుచున్న చక్రవర్తివి. వదాన్యులలో శ్రేష్ఠుఁడవు. నిరంకుశశాసనుఁడవు. అర్థులు కోరినవాని నీయఁగలసమర్థుడవు. నిన్ను వారించువారెవ్వరు? కాని నాకు నీవు చెప్పినవానితో నేమియుఁ బనిలేదు.

మ. గొడుగో జన్నిదమో కమండలువొ నా ♦ కుంముంజియో దండమో
వడుగే నెక్కడ భూములెక్కడ కరుల్ ♦ వామాక్షు లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మమెక్కడ సదా ♦ కాంతాన్వితంబైన మూ
డడుగుల్ మేరయుత్రోవకిచ్చుటది బ్రహ్మాండంబు నాపాలికిన్.

తనకుఁ బ్రాప్తంబగునది లేశమైనను బదివేలని తలంచి తృప్తిఁ జెందిన మనుజుఁడు ధన్యుఁడు.

శా. ఆశాపాశము దాఁ గడున్ నిడుపు, లే ♦ దంతంబు రాజేంద్ర వా
రాశిప్రావృతమేదినీవలయ సా ♦ మ్రాజ్యంబు సేకూరియున్
గాసింబొందిరి గాక వైన్యగయ భూ ♦ కాంతాదులున్నర్థకా
మాశంబాయఁగ నేర్చిరే మును నిజా ♦ శాంతంబులంజూచి కే.

సంతుష్టుఁడు త్రిలోకంబులయందును బూజింపఁబడును. సౌఖ్యమెప్పుడును నట్టి వానికే గలుగుచుండును. వానినే ముక్తికన్యక వరించును. మానవుని తేజము అసంతుష్టివలన జలధారచే ననలము నమయునట్లు చెడిపోవును. (ఇంచుక యూరకుండి) దానవేంద్రా! త్రిభువనాధీశ్వరుండవని నిన్ను నిఖిల మడుగుట నాకు ధర్మముగాదు. నాకుఁ దగినకొలఁది వేడికొనిన మూడడుగుల నేలనిమ్ము. అదియే నాకుఁ జాలును.

బలి—భూదేవోత్తమా! ఈమాత్రపు స్వల్పదానమునకు యోజింప వలయునా! నీయభీష్టము ననుసరించెదఁగాక. (ఆసనమునుండి లేచుచున్నాఁడు.)

శుక్రా—(తనలో) ఈదానము తుదకెట్లు పరిణమించునో (కొంచెమాలోచించి) ఈబ్రాహ్మణుఁడు సామాన్యుఁడుగాడు. (బలింజూచి రహస్యముగా) రాక్షసేంద్రా! నీవుదానమిచ్చుటకు సంసిద్ధుఁడవగుచుంటివా యేమి?

బలి—ఆచార్యా! ఈస్వల్పదానమునకుఁ బ్రయత్నము కావలయునా? ఈచిన్నవాఁని యభీష్టముఁ దీర్చుటకన్న నాకు మఱియొక సుకృతమేమియున్నది?

శుక్రా—

సీ. దనుజేంద్రయీతఁడు ♦ ధరణీసురుఁడు గాఁడు
దేవకార్యంబు సాధించుకొఱకు
హరివిష్ణుఁడన్నయుం ♦ డదితిగర్భంబునఁ
గశ్యపసూనుఁడై ♦ కలిగినాఁడు
ఎఱుఁగవీతనికోర్కి ♦ నిచ్చెదనంటివి
దైత్యసంతతి కుప ♦ ద్రవమువచ్చె
నీలక్ష్మిఁ దేజంబు ♦ నెలవు నైశ్వర్యంబు
వంచించి యిచ్చుఁ దా ♦ వాసవునకు

ఆ. మొనసి జగములెల్ల ♦ మూఁడుపాదంబుల
నఖిల కాయుఁడగుచు ♦ నాక్రమించు
సర్వధనము విష్ణు ♦ సంసర్జనముసేసి
బడుగు పగిది నెట్లు ♦ బ్రదికెదీవు.

నీవొసంగు దానము గ్రహించి యీతఁడు ఒక్క పదమున భూమియు, రెండవ పదంబున దివంబును నాక్రమించి, యున్నత మూర్తియై దిక్కులును గగనమును నిండినచో నీవెక్కడికిఁ బోవుదువు? ఏ దానమువలన నాశము గలుగునో అట్టిది దానము కాదని తత్త్వవిదులు చెప్పిరి. పదాన్యుఁడెప్పుడును దనకున్న భాగ్యమును నైదు భాగములుగా విభజించి, కామమునకు, యశమునకు, నర్థమునకు, ధర్మమునకు, నాశ్రితబృందములకును వినియోగించవలయును. ఉన్న ధనంబును దానమిచ్చునప్పుడు తనకుఁ జేటును గొఱఁతయు గలుగకుండ యోచించువాఁడు హానిఁ బొందఁడు. మఱియు నొక్క విశేషము గలదు.

ఆ. వారిజాక్షులందు ♦ వైవాహికములందుఁ
బ్రాణవిత్తమాన ♦ భంగమందుఁ
జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము ♦ వొందదధిప.

మ. కులమున్ రాజ్యముఁ దేజమున్ నిలుపుమీ ♦ కుబ్జుండు విశ్వంభరుం
డలఁతింబోఁడు త్రివిక్రమస్ఫురణనాఁ ♦ డైనిండు బ్రహ్మాండముం
గలఁడే మాన్పనొకండు నాపలుకులా ♦ కర్ణింపు కర్ణంబులన్
వలదీ దానము గీనముం బనుపుమా ♦ వర్ణిన్ వదాన్యోత్తమా.

జా బా—(శుక్రునుద్దేశించి) దానమిచ్చువారు లేరుగాని దానములకు భంగముసేయు సమర్థులు పెక్కండ్రు కలరు. ఆచార్యులవారు బలికేదో బోధించు చున్నారే.

బలి—(తనలో) ఆచార్యుండిట్లు చెప్పుచున్నాఁడు. నీకోరికఁ దీర్చెద నని యీ బ్రాహ్మణునితోఁ బలికియున్నాడను. ఇప్పుడేమి సేయుదును? ఈ బ్రాహ్మణోత్తముఁడుఁ గోరిన దానమునకు వెనుదీయుదునా! గురువాక్యము ననుసరింతునా! ఏమి సేయుటకును దోచకున్నది. నా స్థితిఁ యిప్పుడు "ముందుబోయిన నూయి, వెనుక కేగిన గోయి" యన్నట్లున్నది. ఈ బ్రాహ్మణునకు దానమొసంగకుంటినేని సత్యభంగమొనవును. గురుని వాక్యము ననుసరింపక యుంటినేని గురుధిక్కారణదోషము సంభవించును. (ఆలోచించి) ఏమైనను సరే! సత్యభంగమునకు నా చిత్తము సమ్మతింపదు. ధర్మవిదులు సత్యమే పరమ ధర్మమని పలికిరి. జగమంతయు సత్యమువలననే స్థాపింపబఁడి నది. సమస్త దేవతలును, ఋషులును సత్యమునే గౌరవింతురు అట్టిచో నా సత్యవ్రతమునకు నేనెట్లు భంగము గావింపఁగలను

త్రిభువనసామ్రాజ్య లక్ష్మీధురంధర రమణీయ హేమరత్న సింహాసనాసీనుఁడగు- ఈబలి; నిరంతర దానధారాపటలుఁడగు- ఈబలి; వైరిజనప్రతాపాటోపగర్వభంజనుఁడగు ఈబలి; వివిధాశ్రిత విద్వద్గురుసుహృద్బాంధవనికాయభాగధేయుండగు ఈబలి; ఆశ్రితజనరక్షణదీక్షాబద్ధకంకణుఁడగు ఈబలి:— అసత్యమాడెనేని జగంబులుపరిహసింపవా? అట్లొనర్చితినేని, నాసత్యమునకు, శౌర్యమునకు, సత్కార్యజ్ఞానమునకు గళంకము కలుగును. నాపవిత్ర జీవితమునకు మాలిన్యముగలుగును. నాధర్మవర్తనమునకు, నా పురుషార్థమునకు, నాగౌరవమునకు, నాశీలమునకును, భంగము కలుగును. నేను ఘోరనరక కూపమునఁబడుదును. ఏ మనుష్యుఁడు తన్నుదా జయించుకొనునో, ఎవ్వఁడు దూరాన్వేషణ తత్పరుఁడై యుండునో, ఎవడ సత్యాధర్మములకుఁ జిత్తమునఁ జోటీయకుండునో, యట్టివానిని భాగ్యలక్ష్మి వరించును. నేఁడీ బ్రాహ్మణునకు దానమిచ్చుటకు వెనుదీసితినేని లోకము నన్నతినీచదృష్టితోఁజూచును. ఇంతవఱకు నాసత్ప్రవర్తనచే నార్జించిన యశము మన్నుఁగలియును. అశాశ్వతములగు ప్రాపంచిక సౌఖ్యములకును, చంచలములగు సంపదలకును జలబుద్బుదము వంటి దేహమునకును, నాశించి, అసత్యమాడుటకు నాచిత్తము సమ్మతింపదు. ఈతఁడు మాయాభూసురుండగు హరియే యగుగాక! నారాజ్యశ్రీలనెల్ల హరించుగాక! కీర్తియొక్కటే భూమిపై శాశ్వతంబుగ నిలచునది. అవసరమయ్యెనేని సత్యవ్రత రక్షణార్థము నాప్రాణములనైన నర్పించెదను.

శుక్రా—(బలింజూచి) వైరోచనా! ఇంకను ఆలోచించుచుంటివేమి? నావాక్యమున కంగీకరింపుము. ఇందువలన నీకు హానియేమియు సంభవింపదు.

వింధ్యావళి—(జలకలశంబుతోఁ బ్రవేశించును)

బలి—(వింధ్యావళి చేతనున్న కలశమందుకొని వామనుని జూచి)

క. రమ్మా మాణవకోత్తమ
లెమ్మా నీవాంఛితంబు • లేకన కిత్తుం
దెమ్మా యడుగులనిటురా
నిమ్మా కడుగంగ వలయు • నేటికిఁ దడయఁగ.

వామ— బలిని సమీపించి - తన పాదములను ముందునకుఁ (బెట్టుచున్నాడు)

జా బా—(తనలో) ఆహా?

మ. బలిదైత్యేంద్రకరద్వయీకృతజల • ప్రక్షాళన వ్యాప్తికిన్
జలజాతాక్షుఁడు సాచె యోగిమన • స్సంప్రార్థిత శ్రీదమున్
గలితానమ్రమరమాలాలలాటపదవీ • కస్తూరికాశాదమున్
నలినామోదము రత్ననూపురితనా • నావేదముం బాదమున్.

వదాన్యుఁడగు నీబలి యెంతయుఁ గృతార్థుఁడు.

బలి—(వామనుపాదములఁ గడిగి - ఆజలమును శిరముపైఁ జల్లుకొని) వామనా! విష్ణుస్వరూపుండవగు నీకు మూఁడడుగులభూమిని బ్రహ్మప్రీతమ్ముగ ధారవోయుచున్నాఁడ. (వామనుని చేతి యందుఁ గలశజలంబునుఁ బోయుచు) ఏమిదీ! కలశమునుండి జలము రాకయున్నది?

వామ—(తనలో) కలశమునుండి జలధార నడ్డగించుటకు శుక్రాచార్యుఁ డిందుఁ బ్రవేశించినాఁడు. కానిమ్ము. (బలింజూచి) దానవలోక సార్వభౌమా! కలశరంధ్రమునం దేదియో యడ్డముపడినట్లున్నది. (కుశచేఁ గలశరంధ్రమునఁ బొడుచును.)

బలి—ఇదిగో! జలధార వచ్చుచున్నది. (వామనుని హస్తమునఁ బోసి) మహాత్మా! నీవడిగిన దానము త్రికరణశుద్ధిగ నొసంగినాను.

జాబా—(తనలో)

ఆ. కమలనాభు నెఱిఁగి ♦ కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రుమాట ♦ లెఱిఁగి నాశ
మెఱిఁగి పాత్రమనుచు ♦ నిచ్చె దానము బలి
మహివదాన్యుఁడొరుఁడు ♦ మఱియుఁ గలఁడె.

వామ—(బలిం జూచి) ఓ దానవలోకచక్రవర్తీ!

క. క్షితిదానమిచ్చు నతఁడును
నతికాంతఁ బరిగ్రహించు ♦ నతఁడును దురిత
చ్యుతులై శతవత్సరములు
శతమఖలోకమునఁ గ్రీడ ♦ సలుపుదు రెలమిన్.

ఏదానంబును వసుంధరాదానంబుతో సదృశము కాదు. నీవట్టి దాన మొనర్చి మహాసుకృతంబు వడసితివి.

(శుక్రుఁడు ఒకకన్ను పోయినవాఁడై ప్రవేశించును.)

జాబా—(శుక్రాచార్యునిఁ జూచి) ఇదియేమి? ఆశ్చర్యము! దనుజాచార్యున కొకకన్ను పోయినది.

శుక్రా—నాయనా! మహాత్మునకొసంగు దానమున కడ్డము గల్పింపఁ దలఁచుటచే నాకీశిక్ష కలిగినది.

జాబా—పాపము! ఇఁక నెప్పుడును నట్టిది సేయవలదు. ఒకకన్నైన నుండును.

వామ—(విశ్వరూపము ధరించుచున్నాఁడు.)

శుక్రా—(ఆశ్చర్యముతో) ఆహా! అద్భుతము. మాయామాణవకుఁడు విశ్వరూపము ధరించినాఁడు. నేను బలితోఁ జెప్పినట్లైనది.

జగత్సృష్టిస్థితిలయకారణుఁడగు శ్రీహరిమాయల నెవ్వఁడు కనుఁగొనఁగలఁడు? (పరికించి) ఈజగన్నాయకుని రూపము బ్రహ్మాండమంతయు నిండిపోవుచున్నది.

జా బా—(భయము నటించి యిటునటు పరుగెత్తుచు) వామనా! ఈ రూపమేమి! అందఱిని భ్రమింగెదవాయేమి? చిన్నప్పుడుండి భూమ్యాకాశములను నొక్కఁడవే యాక్రమించినావు!

బలి—(తనలో) భగవంతుఁడగు శ్రీమన్నారాయణుఁడే నన్నీ విధంబున ననుగ్రహించుటకు బ్రాహ్మణ రూపంబున వచ్చెను. మదీయ పూర్వపుణ్యవశంబున నీతని నిజస్వరూపముఁజూడఁ గలిగితిని. (ప్రకాశముగా వామను నుద్దేశించి) హే! పురుషోత్తమా! నీవు సకలలోకములకును నాయకుఁడవు. బంధ మోక్షములకుఁ బ్రభుఁడవు, ఆర్త శరణ్యుఁడవు. గురుఁడవు. సకల సృష్టిస్థితి సంహార కర్తవై - బ్రహ్మ విష్ణుశివాఖ్యల రాజిల్లుచుండుదువు. దేవా! మత్స్యాకృతిందాల్చి వార్ధిఁజొచ్చి, వేదములఁ గ్రుచ్చిలిన సోమకాసురునిఁ జంపి, యవ్వేదములఁదెచ్చి యజునకిచ్చితివి. ఇంతకుమున్ను మేమును దేవతలును నమృతమునకై పోరాడునప్పుడు కమఠంబవై మందరగిరి వీపునఁదాల్చి, కపట మోహినీ రూపంబున నమృత మమరులకిచ్చి వారి కజరత్వాయురారోగ్యములఁగూర్చితివి. జగత్కంటకుఁడగు హిరణ్యాక్షుఁడు భూతలంబెల్లఁ జాపఁజుట్టిన చందంబునఁ జుట్టుచుండ, సౌకర్యాకృతిందాల్చి నిజదంష్ట్రాగ్ర భాగమున వసుంధరను నిలిపి, దానవునిఁ గూల్చి లోకముల రక్షించితివి, బ్రహ్మవరగర్వమునఁ గన్నును మిన్నును దెలియక లోకములఁ గంపింపఁ జేయుచున్న హిరణ్యకశిపుని నరమృగరూపమున వధించి, తత్సూనుండగు

ప్రహ్లాదుని రక్షించి, జగంబుల పరితాపము వాపితివి. నేఁడు నా నిమిత్త మీ వామన రూపంబున వచ్చితివి. మహాయోగీంద్రులకైనను దుర్లభమైన నీ నిజరూపము దర్శింపఁగంటిని. విగతదూరుఁడనైతిని. లక్ష్మీకళత్రా!

మ. సరసీజోద్భవశంకరాది సురల ♦ శ్రాంతంబు సేవింపఁ బె
ల్లిరవై యుండు మహానుభావుఁడవు నీ ♦ వీభంగి భూమీసురే
శ్వరవేషంబున రాఁబనేమి నిజ రూ ♦ పస్ఫూర్తితో వచ్చినన్
బరమశ్రద్ధను దేవదేవ నిను సం ♦ భావించి పూజింపనే.

విష్ణుసేవకుఁడు—(ప్రవేశించి—బలిని బంధించి నిష్క్రమించును)

శుక్రా—హా! హా!

బలి—(తనలో) నాకిట్టిది సంభవింప వలసినదేనా—(ఇంచుక యూరకుండి) దీనికి విచారింపనేల? శ్రీహరి నాయందిట్లు కృపవహించినాఁడు,

(తెరలో)

(ఓహో! రాక్షసులారా! చూచెదరేమి! కపటవటుని వేషంబున వచ్చిన శ్రీహరియని యెఱుంగక మన బలిదానమిచ్చి యిట్లు బంధింపఁ బడినాఁడు. మనమింక నీ బ్రాహ్మణుని పోనీయక రూపుమాపుదము, రండు. రండు.)

వామ—(ఎదుటఁజూచి తనలో) మదీయ పరిచరులగు సునంద నంద జయ జయంతాదులు నిఖిలాయుధ సమేతులై యరుదేరఁగా రక్కసులు వారిని దాకుటకు సన్నద్ధులగుచున్నారు.

బలి—(ఎదుటఁజూచి రాక్షసుల నుద్దేశించి)

సీ. రాక్షసోత్తములార ♦ రండు పోరాడక
కాలంబు గాదిది ♦ కలహామునకు

సర్వభూతములకు ♦ సంపదాపదలకుఁ
ప్రభువైన దైవంబు ♦ బరిభవింప
మనమోపుదుమె; తొల్లి ♦ మనకు రాజ్యంబును
సురలకు నాశంబు ♦ సొరిది నిచ్చి
విపరీతముగఁ జేయు ♦ వేల్పు నేమందము
మనపాలి భాగ్యంబు ♦ మహిమఁ గాక

తే. వెలచి పలుమాఱుఁ బాఱెడి ♦ విష్ణుభటులు
మిమ్ము నెగచుట దైవంబు ♦ మేరగాదె
మనకు నెప్పుడు దైవంబు ♦ మంచి దగును
నాఁడు గెలుతము పగవారి ♦ నేఁడు వలదు.

వామ—(తనలో) సంపదకు దూరుఁడైనను దైన్యముగాని, కంపము గాని యుండక, ధైర్యచేతస్కుండై యీ బలి నిలిచియున్నాడు. (ప్రకాశముగా బలింగాంచి)

సీ. దానము త్రిపదభూ ♦ తలమిత్తునంటివి
తరుణచంద్రార్కులు ♦ దాకనుండు
నంతభూమియు నొక్క ♦ యడుగయ్యె నాకును
స్వర్లోకమును నొక్క ♦ చరణమయ్యె
నన్ను నీ సొమ్ము రెం ♦ డడుగులఁ గలసెను
గడమ పాదమునకుఁ ♦ గలదె చోటు
నిచ్చెద నన్నర్థ ♦ మీని దురాత్ముండు
నిరయంబు బొందుట ♦ నిజముగాదె

తే. కాన దుర్గతికిని గొంత ♦ కాలమరుగు
కాక యిచ్చెద వేని వే ♦ గంబ నాకు

నిపుడు మూఁడవపదమున ♦ కిమ్ముఁజూపు
బ్రాహ్మణాధీనములుఁ దోఁవ ♦ బ్రహ్మవశమె.

బలి — మహాత్మా! నాకుసత్యమే భూషణము. రాజ్యనాశనమునకుఁ గాని ప్రాణనాశమునకుఁగాని చింతింపను. సత్యమునే కాపాడు కొందును.

ఆ. సూనృతంబుగాని ♦ నుడియుదు నాజిహ్వ
బొంకఁజాలనాకు ♦ బొంకులేదు
నీతృతీయపదము ♦ నిజమునాశిరమున
నెలవుసేసి పెట్టు ♦ నిర్మలాత్మ.

ఆ. నిరయమునకుఁబ్రాప్తి ♦ నిగ్రహంబునకును
బదవిహీనతకును ♦ బంధనమున
కర్థభంగమునకు ♦ నొవ్యసనమునకు
వెఱవ దేవ! బొంక ♦ వెఱచినట్లు.

సీ. తల్లిదండ్రులు నన్ను ♦ దమ్ములుఁజెలికాండ్రు
గురువులు శిక్షింపఁ ♦ గొఱఁతపడు నె
పిదపమేలగుఁగాక ♦ పృథుమదాంధులకును
దానవులకు మాకుఁ ♦ దఱిమెఱింగి
విభ్రంశచక్షువు ♦ నెలయునిచ్చుటఁజేసి
గురువులలోనాది ♦ గురువనివ
నీవుబంధించిన ♦ నిగ్రహామో లజ్జ
యోనష్టియో బాధ ♦ యోతలంప

తే. నిన్ను నెదిరించి పోరాడి ♦ నిర్జరారు
లాదియోగీంద్రులందెడు ♦ నట్టిబెంకి
నందరేతొల్లి పెక్కండ్రు ♦ హార్షమూర్తి
వైరభక్తులు గట్టిగా ♦ వలయుఁగాక

యీశనీయెడ దుర్లభ ♦ మేమిగలదు.

మూఢాత్ములు సత్యదానకరుణాధర్మంబులకు దూరులై యీ సంసారము నిక్కమని తలంతురు.

సీ. చుట్టాలు దొంగలు ♦ సుతులు ఋణస్థులు
కాంతలు సంసార ♦ కారణములు
ధనములస్థిరములు ♦ దనువతి చంచల
కార్యార్థులన్యులు ♦ గడచుఁగాల
మాయువుసత్వర ♦ మైశ్వర్య మతిశీఘ్రి
మసికాదె తమతండ్రి ♦ నతకరించి
మాతాత సాధు సమ్మతుఁడు ప్రహ్లాదుండు
నీపాదకమలంబు ♦ నియతిఁజేరె
తే. భద్రుఁడతనికి మృతిలేని ♦ బ్రిదుకుగలిగె
వైరులై కాని తొల్లి మా ♦ వారుగాన
రర్ధులైవచ్చి నీవు స♦న్నడుగుటెల్ల
పద్మలోచన నాపుణ్య ♦ ఫలముగాదె.

ప్రహ్లాదుఁడు—(ప్రవేశించి వామనునిఁజూచి) దేవా! నీచరణంబులకు నమస్కరించుచున్నాను. (నమస్కరించును.)

బలి—(ప్రహ్లాదునిఁజూచి) పితామహా! మహానుభావుండగు శ్రీహరిచే వారుణపాశబద్ధుండ నగు నేను నీకుఁ గరంబులమోడ్చి నమస్కరింపఁజాలకయున్నాను. శిరమువంచి యొసంగు నావందనములఁ గైకొనుము.

ప్రహ్లా—(వామనునిఁజూచి) దేవా! జగన్నాథా!

సీ. ఇతనికి మున్న నీ ♦ వింద్రపదంబిచ్చి
నేఁడు త్రిప్పుటయును ♦ నెఱయమేలు

మోహనాహంకృతి ♦ మూలంబు గర్వాంధ
తమసవికారంబు ♦ దానిమాన్పి
కరుణరక్షించుట ♦ గాక బంధించుటే
తత్వజ్ఞునకు మహేం ♦ ద్రత్వమేల
నీపాదకమలంబు ♦ నియతిఁగొల్చినదానిఁ
బోలునే సురరాజ్య ♦ భోగపరత
తే. గర్వమేపారఁగన్నులు ♦ గానరావు
చెవులువినరావు చిత్తంబు ♦ జిక్కువడును
మఱచు నీసేవలన్నియు ♦ మహిమమాన్పి
మేలుసేసితి నీమేటి ♦ మేరసూపి.

వింధ్యావళి-(ప్రవేశించి వామనునకు నమస్కరించి)

ఉ. ఏపరమేశ్వరున్ జగము ♦ లిన్నిఁటి గప్పినమాయఁ గప్పగా
నోపక పారతంత్ర్యమున ♦ నుండు మహాత్మక యట్టినీకు ను
ద్దీపితభద్రమూర్తికి ను ♦ ధీజనరక్షణ వర్తికిం దనూ
తాపము వాయ మ్రొక్కెద ను ♦ దారతపోధన చక్రవర్తికిన్.

క. నీకుం గ్రీడార్థములగు
లోకంబులఁ జూచివరులు ♦ లోకులు కుమతుల్
లోకాధీశుల మందురు
లోకములకు రాజ వీవ ♦ లోకస్తుత్యా.

క. కాదనఁడు సొమ్ములేవీ
రాదనఁడు జగత్త్రయైక ♦ రాజ్యము నిచ్చెన్
నాదయితుఁ గట్టనేటికి
శ్రీదయితాచిత్తచోర ♦ శ్రితమందారా!

దేవా! అఖిలజగన్నియామకుండవగు నీకొనర్పు కార్యము కాదను వారెవ్వరు? నిజభుజబలపరాక్రమంబునఁ ద్రిభువనంబుల గెలిచి, నిరంతర సత్యవ్రతాచారపారీణుఁడై; ధర్మసంధుఁడై; దానకంకణధరుఁడై; విరాజిలు-నాభర్త నీవలన నిట్టి శిక్షకు బాత్రుఁడే! భక్తజనరక్షణ దీక్షాపరతంత్రుఁడవగు నీ కీతని బంధించుటధర్మమనితోచినదా! మహాత్మా! పతిభిక్షఁ బెట్టుము.

బ్రహ్మ—(ప్రవేశించి వామనునిఁజూచి)

సీ, భూతలోకేశ్వర ♦ భూతభావన దేవ
దేవజగన్నాథ ♦ దివ్యరూప
తనసొమ్ము సకలంబు ♦ దప్పకనీకిచ్చె
దండయోగ్యుఁడుగాఁడు ♦ దానపరుఁడు
కరుణింపనర్హుండు ♦ కమలలోచన నీకు
విడిపింపు మీతని ♦ వెఱపుఁదీర్చి
తోయపూరముచల్లి ♦ దుర్వాంకురంబులఁ
జేరి నీపదము, ల ♦ ర్చిందునట్టి

తే. భక్తియుక్తుఁడు లోకేశ ♦ పదము నొందు
నీవు ప్రత్యక్షముగ వచ్చి ♦ నేడువేఁడ
నెఱిఁగితన రాజ్యమంతయు ♦ నిచ్చినట్టి
బలికిఁదగునయ్య దృఢపాశ ♦ బంధనంబు.

వామ—(బలిని బంధవిముక్తునిఁ జేసి-బ్రహ్మనుజూచి) చతుర్ముఖా!
సీ. ఎవ్వనిఁగరుణింప ♦ నిచ్ఛయించితివాని
యఖిల విత్తంబు నే ♦ నపహరింతు
సంసార గురుమద ♦ స్తబ్ధుఁడైయెవ్వఁడు
జగడిలోకము నన్ను ♦ ధిక్కరించు

నతఁడెల్లకాలంబు ♦ నఖిలయోనులయందు
బుట్టుచు దుర్గతిఁ ♦ బొందుపిదప
విత్తవయోరూప ♦ విద్యాబలైశ్వర్య
కర్మజన్మంబుల ♦ కర్మముడిగి

తే. యేకపథమున వినుతుఁడై ♦ యెవ్వఁడుండు
వాఁడు నాకూర్చి ♦ రక్షింప ♦ వలయువాఁడు
స్తంభలోభాభిమాన సం ♦ సారవిభవ
మత్తుఁడై చెడనొల్లఁడు ♦ మత్పరుండు.

శా. బద్ధుండై గురుశప్తుఁడై చలితుఁడై ♦ బంధుప్రజత్యక్తుఁడై
సిద్ధైశ్వర్యముఁ గోలుపోయి విభవ ♦ క్షీణుండునై పేదయై
శుద్ధత్వంబును సత్యముంగరుణయుం ♦ జొప్పేమియుం దప్పఁడు
ద్బుద్ధుండై యజయాఖ్య మాయ గెలిచెన్ ♦ బుణ్యుండితండల్పుఁడే.

చతుర్ముఖా! రాక్షసేంద్రుఁడగు నీతని మర్యాదఁ జూడవలయు ననియే నేనిట్లొనర్చితిని. నిర్మలాచారుండగు నీతఁడు సత్యము దప్ప లేదు, ఈతని చరిత్రమునకే నెంతయు మెచ్చితిని. సావర్ణిమనువు వేళ నీతఁడు దేవేంద్రుఁడగును. తరువాత దేవతలకును దుర్లభమైన నా చోటికి రానించెదను. అందాక నీతఁడు మహేంద్ర వైభవమును మించిన వైభవంబును బొందుచు సుతలంబున నుండును. (బలిం జూచి) వైరోచనా! నీవు భయంబందవలదు. నీవు సత్యదాన కరుణా గుణంబులచే నన్ను వశపఱచుకొంటివి. నీవిఁక సుతలంబున నుండుము. నీయాజ్ఞఁ దీర్చని నిర్జరారాతులను నా చక్రమే తెంచి ఖండించుచుండును. నిన్నును నీ వారిని నేను నిరంతరము రక్షించుచుందును

బలి—మహాప్రసాదము— ఇంచుక యూరకుండు, దేవా!

ఉ. ఎన్నఁడుఁ లోకపాలకుల • నీకృపఁ జూడని నీవు నేఁడు న
న్నన్నఁ దుఁ జేసి నా బ్రదుకు • నోజయు నాపతి యిచ్చి కాచితీ
వన్న నరీ దయారసము • మాటల సిద్ధతికంబు జాలవే
పన్నగ తల్పనిన్ను జేఁగి • పట్టిన నాపదగల్గ నేర్చునే.

ప్రహ్లా—దేవా! బ్రహ్మపూజిత పదుండవైన నీవు—క్రూరులమునౌ
గుత్సితాత్మ కులమును నగుమాయెడల నిట్లు ప్రసన్నుఁడ వగుట
చిత్రము.

ఆ. సర్వగతుఁడవయ్యు • సమదర్శనుఁడవయ్యు
నొకట విషమవృత్తి • నుందు దీవు
నిచ్చలేని వారి • కీవు భక్తులు గోరు
తలఁపులిత్తు కల్ప • తరువుమాడ్కి.

బలి—
తే. వత్స! ప్రహ్లాద మేలు నీ • వారు నీవు
శౌరిది మనుమనిఁ దోడ్కొని • సుతలమునకు
బయనమై పొమ్ము నీగదా • పాణి నగుచు
జేరి రక్షింప దురితంబు • సెందదచట.

(ప్రహ్లాదుఁడును—బలియు వామనునకు నమస్కరించి తమవారి
తో నిష్క్రమింతురు.)
ఇంద్రుడు—(ప్రవేశించి)
మ. జడులై నాకము గోలుపోవు సురలం • జంభారినిం బ్రోవగా
వడుగై భూమిఁ బద త్రయంబిడుటకై • వైరోచనిన్ వేఁడి రెం
డడుగుల్ సాచి త్రివిక్రమస్ఫురణ బ్ర • హ్మాండంబు దానిండుచుం
గడు మోదంబున నుండు వామనునకున్ • గాలంబునన్ మ్రొక్కెదన్
(వామనునకు నమస్కరించును.)

వామ—(శుక్రాచార్యునిఁజూచి) బలి యజ్ఞము సేయుచున్నాఁడు కదా!

ఏమి కొఱఁతపడియె ♦ నీతఁ డీజన్నంబు
విస్తరింపఁ గడను ♦ విప్రవర్య
విమలమైన కర్మ ♦ వివరంబు బ్రాహ్మణ
జనులు సూచినంత ♦ సమతఁ బొందు.

శుక్రా—దేవా! అఖిల కర్మంబులకును నీవే యధినాథుండవు. యజ్ఞేశుఁడవు. యజ్ఞపురుషుఁడవు. నీవు పరితుష్టి నొందినచోఁ గర్మములకుఁ గొఱంతలు కలుగునా! అయినను నీయానతి శిరంబున దాల్చి జన్నంబునందున్న కొఱంతఁ దీర్చెద.

వామ—(ఇంద్రునిఁ జూచి) మహేంద్రా! ఇప్పుడు నీకానందము లభించినదికదా! ఇఁక నీ పరివారముతో నమరావతిం జేరి సుఖముగా రాజ్యముఁ బాలింపుము.

ఇంద్రు—జగత్కర్తవగు నీ మహామహిమ వర్ణింపఁజాలను. నానిమిత్తము శ్రమవహించిన నీకనేక నమస్కారము లర్పించుచున్నాను.

జాబా—(బ్రహ్మాదులను జూచి)

ఆ. బల్లిదంపుఁ దోడు ♦ ప్రాపున నిందుని
కింద్రపదము నేఁడు ♦ యిట్లుగలిగె
జనకు నాథుఁ డైన ♦ తమ్ముఁడు గలిగిన
నోర్కులన్ని కేల ♦ కొఱఁతయుండు.

క. పాలముఁ గడు మేలముగం
జేలఁడు భిక్షించియున్న ♦ కిచ్చెఁ ద్రిజగముల్
వేలుపులతల్లి కడపటి
చూలుం బోలంగఁ గలరె ♦ సొలయని తమ్ముల్

బ్రహ్మ—(ఇంద్రునిఁ జూచి) మహేంద్రా! భగవంతుఁడగు శ్రీహరి కటాక్షమున నీకు మరల నమరలోక రాజ్యము లభించినది.

సీ. ధర్మదండంబై యుండ • పత్త్రిముగాఁగ సకలపరి
జనుసాగంబై • సింహాసనముగ
ముని జనాశీస్సులే • శుభచామరలుగాఁగ
న్యాయసృష్టి నెమ్మె • కృపాణంబుగాఁగ
దశదిశల వ్యాపించు • యశమె చేలముగాఁగ
సత్యంబె దివ్యధ్వ • జంబుగాఁగ
సే. వేదుల (మొక్క • నీరాజనముగాఁగ
దివ్యతేజము మేటి • దివిటిగాఁగ.
తే. నరకుఁ జూడఁగ సకలది • క్కృతులు నిన్ను
సంతతము ధర్త్రీ గొల్వ రా • జసభయుంబు
విడచి గావించెదవు గాక • విబుధలోక
పాలనంబును నాచంద్ర • భాస్కరముగ.

జా బొ — శుభాస్తు

(తెర వాలును).

ఇతి పంచమాంకము.
గ్రంథము సంపూర్ణము.